www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 సెప్టెంబర్ 2025

8 పేజీలు



ఏలూరు



పశ్చిమ గోదావరి

రొయ్య ఉక్కిరిబిక్కిరి..!

ఓవైపు సుంకాలు..
మరోవైపు వ్యాధులు
తల్లడిల్లుతున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

అమెరికా ఇష్టానుసారంగా విధించిన సుంకాల భారంతో రొయ్య ఎదురీదుతోంది. ఇదే సమయంలో వాతావరణ మార్పులతో వ్యాధులు దాడి చేస్తుండటంతో ఎదుగుదల లోపిస్తోంది. దీంతో రొయ్యలను రక్షించుకోవడానికి రైతులు నానావస్థలు పడుతున్నారు.



ప్రాతళ్లమెరకలో రొయ్యల చెరువులో ఏరియేటర్లు

వనామి రొయ్యల సాగుకు అనుకూలంగా ఉండటంతో చాలామంది రైతులు ఎకరానికి రెండు లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు. అధిక వ్యయంతో ఏరియేటర్లు, విద్యుత్ మోటార్లు అమర్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస ఖర్చులు కూడా రాక పోవడంతో అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యను బతికించుకునేందుకు వ్యయమైనప్పటికీ చెరువుల్లో ఏరియేటర్లను నిరంతరాయంగా తిప్పుతున్నారు. వేలాది రూపాయల విలువైన మందులు చల్లుతున్నారు. వాతావరణ మార్పులతో అకస్మాత్తుగా రొయ్యలు చనిపోతూ ఉండటంతో వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు రొయ్యలు కొంటున్నారని రైతులు వాపోతున్నారు. విదేశీ మారక ద్రవ్యం లభించే రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు ..6లో

ఉమ్మడి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. దీనిలో రొయ్యల సాగు 1.10 లక్షల ఎకరాల్లోనూ, చేపల సాగు 1.80 లక్షల ఎకరాల్లోనూ ఉంది. వాతావరణ మార్పులతో ఉప్పుటేరు, కొల్లేరు వంటి తీరప్రాంత గ్రామాల్లోని చెరువుల్లో ఆక్సిజన్ అందక రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో కౌంట్‌కు రాకుండానే చిన్న సైజు రొయ్యలను హడావిడిగా పట్టుబడి చేస్తున్నారు. చిన్న సైజు కారణంగా గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు.

నిరంతర స్ఫూర్తి ప్రదాత గారపాటి విమల

నేడు ఏలూరులో సంస్మరణ సభ

ఐదో పేజీలో..



కిరాయిలు లేక.. కిస్తీలు కట్టలేక..!

ఆటో కార్మికుని ఆత్మహత్యాయత్నం
తప్పిన ప్రాణాపాయం
రూ.5 లక్షలు సాయం అందించాలి
ఆటో అండ్ ట్రాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

ఉచిత బస్సు పథకాన్ని తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆటో కార్మికులను ఆదుకోకపోవడం, కిరాయిలు లేక ఏం చేయాలో పాలుపోక ఆటో కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వేల్పూరు గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు కోల రాంబాబు ఆటో కిరాయిలు లేక, ఫైనాన్స్ చెల్లించలేక మంగళవారం పురుగులమందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, తోటి ఆటో కార్మికులు హుటాహుటీన తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ..6లో

ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు

ప్రజాశక్తి - నిడమర్రు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఉద్యోగ, ఉపాధి భద్రత కల్పించడంలో విఫలమయ్యాయని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు అన్నారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు సమన్వయ కమిటీ కానూరు రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రయివేటు, పారిశ్రామిక రంగాలలో కార్మిక వర్గం తీవ్రగా నష్టపోతున్నారన్నారు. కార్మికుల హక్కుల రక్షణకై పోరాటాల్లో పాల్గొవలసి ఉంటుందని, అలాగే ఈనెల 13, 14వ తేదీల్లో నూజివీడులో సిఐటియు జిల్లా 13వ మహాసభలను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎ.నాగమణి, కమిలి నాని, దేవిన విజయలక్ష్మి, మైలవరపు నాగలక్ష్మి, కోరాడ రమణ, టి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ జెడ్పి హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు బుధవారం మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సామాజికవేత్తలు సుందర్ రావు, భాను కిరణ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, జీవితాన్ని వృధా చేసుకోవద్దని సోదాహరణంగా వివరించారు. క్రమశిక్షణతో చదువుకొని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో వ్యసనాలకు బానిసలయితే భవిత శూన్యంగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థి జీవితంలో చదువు, సాంస్కృతిక, సామాజిక, సృజనాత్మక అంశాలతో పాటు క్రీడల పట్ల ప్రతిభ కనపరచాలన్నారు. ప్రతి అంశంలోనూ నైపుణ్యత సాధించి పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలని, అందుకోసం ఆయా అంశాలకు చెందిన ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన చారిత్రాత్మకమైన పాఠశాలగా ఉన్న ఎస్ఆర్ఆర్ జెడ్పి బాయ్స్ హై స్కూల్లో చదువుకోవడం అంటే ఎంతో అదృష్టంగా భావిస్తారన్నారు. శతాబ్దాల గొప్ప చరిత్ర గల పాఠశాలలో ఎందరో మహనీయులు విద్యను అభ్యసించిన చరిత్ర ఉందని వివరించారు. ఆనాటి చరిత్రను తిరగరాస్తు గొప్ప చరిత్రకారులుగా నేటి విద్యార్థులు ఎదగాలని, సరికొత్త చరిత్ర సృష్టించాలని విద్యార్థుల కరతాల ధ్వనుల మధ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇడి సంతకం ఫోర్జరీ


జూనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్ సస్పెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడు అన్నట్టుగా ఏలూరు ఎస్సి కార్పొరేషన్ ఇడి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఎస్సి కార్పొరేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అతన్ని విధుల నుండి సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ కులాల లబ్ధిదారుల కోసం షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం ఏలూరులో నిర్వహిస్తూ ఉంటారు. ఈ ఎస్సి కార్పొరేషన్ షెడ్యూల్ కులాల వారికి నిధులు మంజూరు చేయడం, వారికి ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేసి మరలా రుణాలు కావలసిన వారికి రుణాలను మంజూరు చేయటం చేస్తూ ఉంటుంది. అయితే ఈ ఎస్సి కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్ అనే జూనియర్ అసిస్టెంట్ తన చేతివాటాన్ని ప్రదర్శించాడు. తనకు కావాల్సినప్పుడల్లా ఏకంగా ఇడి సంతకాన్నే ఫోర్జరీ చేయడం ప్రారంభించాడు. ఇలా ఒకసారి రూ.50 వేలు, ఒకసారి రూ.30 వేలు, ఒకసారి రూ.5 వేలు ఇలా దఫ దఫాలుగా రూ.6 లక్షలను ఏకంగా ప్రభుత్వ ఖాతా నుండి విత్‌డ్రా చేసుకుని తన స్వప్రయోజనాల కోసం వినియోగించుకున్నాడు. విషయాన్ని ఆలస్యంగా గమనించిన ఇడి జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్వపరాలు పరిశీలించిన కలెక్టర్ అతన్ని విధుల నుండి సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతనిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.

పరిసరాల్లో నీటిని నిల్వ ఉంచరాదు

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మంచినీటి నిల్వ ప్రాంతాలే డెంగీ దోమలకు ఆవాసాలని, ప్రజలు ఇంటి లోపల, బయట నీటిని నిల్వ ఉంచరాదని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఎప్పటికప్పుడు పాత్రలు కడిగి పెట్టుకోవాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులు డెంగీ, మలేరియా వంటి వ్యాధులను తగ్గించుకోవచ్చని ఆయన సూచించారు. స్థానిక ఏలూరు తంగెళ్లమూడి పట్టణ ఆరోగ్య కేంద్రం రజకుల పేట కాలనీలో డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగీ జ్వరం సాధారణ జ్వరం అని, అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని అన్నారు. ప్రజలు ఫ్రైడే డ్రై డే ఆచరించాలని సూచించారు. అనంతరం రజకుల పేట వీధిలో దోమ లార్వాను ప్రత్యక్షంగా ప్రజలకు చూపిస్తూ, దోమల నిర్మూల ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, మురళీ, ఆరోగ్య కార్యకర్త తంగెళ్ల కామేశ్వరి, ఆశా కార్యకర్త సుల్తానా, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో ఆత్మహత్య నివారణ దినోత్సవం

నూజివీడు టౌన్ : జీవితంలో సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ఎవరి జీవితమూ వడ్డించిన విస్తరి కాదనీ, చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్యలు చేసుకోవడం మంచిది కాదని జెడి డాక్టర్ నరసింహరావు అన్నారు. ఆర్‌జియుకెటి నూజివీడులో ఆత్మహత్యా నివారణ దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల్లో ఆత్మహత్యల్ని నివారించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీస్ సిబ్బంది నిర్వహించారు. ఇందులో జెడి డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ఒక తలుపు మూసుకుపోతే ఇంకో తలుపు మన కోసం తెరిచి ఉంటుందని, చిన్న వయసులోనే నిరాశ నిస్పృహలతో జీవితాన్ని అంతం చేసుకోవడం మంచిది కాదన్నారు. ఆ విషయాన్ని విద్యార్థులందరూ గుర్తుంచుకోవాలని తెలియజేశారు. ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి పర్యవేక్షించారు.

డిఎల్‌డిఒ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిసర ప్రాంతాల్లో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయ నిర్మాణానికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న బుధవారం పరిశీలించారు. పట్టణ పరిధిలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయ ఆవరణం, హనుమాన్ జంక్షన్ రోడ్‌లో గల జిల్లా పరిషత్ బంగ్లా స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న 95 సెంట్లు భూమి, హనుమాన్ జంక్షన్ రోడ్డులో గల జిల్లా పరిషత్ బంగ్లా ఆవరణలో ఉన్న 1.90 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉండడాన్ని గుర్తించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు సంబంధించి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వెల్లడించారు. అను కూలమైన ప్రాంతంలో డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కార్యాలయాన్ని నిర్మించేందుకు త్వరలో ప్రభుత్వ ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

పాఠశాలకు సామగ్రి బహూకరణ

కలిదిండి : మండలంలోని తాడినాడ అల్లూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత కొత్తపల్లి వెంకట బంగార్రాజు రూ.30 వేలు విలువగల రెండు ఇనుప బీరువాలు, రెండు పెడస్టల్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సర్పంచి తాడి శ్రీనివాసరావు, హెచ్ఎం జివి.రమణ, పూర్వ హెచ్ఎం డి.ఉమా దేవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మానవత సాయం

భీమడోలు : అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ఆవాస ప్రాంతంలో కుటుంబ యజమానులు చనిపోయిన కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు దళిత కుటుంబాల వారికి మానవత సంస్థ ఆత్మీయ సహకారాన్ని బుధవారం అందజేసినట్లు సంబంధిత విభాగ జిల్లా చైర్మన్ రామిశెట్టి గంగాధర రావు తెలిపారు. ఈమేరకు మానవత భీమడోలు శాఖ అధ్యక్షులు ఎ.ప్రసాదరావు, కోశాధికారి జి.రమణ శంకర్ నేతృత్వంలో మానవత సభ్యులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సంస్థ తరపున సదరు రెండు కుటుంబాల సభ్యులందరికీ రామిశెట్టి గంగాధరరావు చేతుల మీదుగా బియ్యం, నిత్యావసరాలు, వంట సామాగ్రి, దుస్తులు, ఇతరాలను అందజేశారు.

వైసిపి మండల ప్రచార కమిటీ అధ్యక్షులుగా వాసు

కొయ్యలగూడెం : వైసిపి మండల ప్రచార కమిటీ అధ్యక్షులుగా తొర్లపాటి వాసు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లకు వాసు శుభాకాంక్షలు తెలిపారు. తాజా నియామకంపై పలువురు నేతలు వాసును అభినందించారు. జిల్లా ఉపాధ్యక్షులు మంతెన సోమరాజు, మండల పరిషత్ అధ్యక్షులు గంజామాల రామారావు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి ఘంటా శ్రీనివాస్ తదితరులు వాసుకు శుభాకాంక్షలు తెలిపారు.

కిషోర్ వికాసం 2.0పై అవగాహన

ఏలూరు సిటీ : మండలంలోని రామానగర్ కాలనీ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో కిషోర్ వికాసం 2.0పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్యోషి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు ప్రాముఖ్యత, పౌష్టికాహారం గురించి తెలియజేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శి అరుణకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, పోక్సో చట్టం గురించి అందరికీ వివరించారు. ఎఎన్ఎం కనకదుర్గ, ఎంఎల్ఎహెచ్ పి.నాగలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని, నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రోజిలిన్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శ్రీ సుగుణలో ప్రెషర్స్ డే వేడుకలు

కలిదిండి : స్థానిక శ్రీసుగుణ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ సుజన్మయి సుగుణ తెలిపారు. నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలుకుతూ వివిధ నృత్య ప్రదర్శనలు జరిగాయన్నారు. కళాశాలలో ఎల్‌కెజి నుండి పిజి వరకు నిర్వహిస్తున్నామని, డిగ్రీలో ఎఐ డేటా సైన్స్ ప్రవేశ పెట్టినందున విద్యార్థులు ఆయా అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ టివి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వలు ఉన్నాయి

సొసైటీ చైర్మన్ అడపా నాగరాజు

టి.నరసాపురం : రైతుల అవసరాలకు అనుగుణంగా అన్నిరకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు తెలిపారు. మధ్యాహ్నపువారి గూడెం సొసైటీలో ఎరువుల గోదామును మండల వ్యవసాయాధికారి ప్రియాంకతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. రైతుల అవసరానికి సరిపడా ఎరువుల నిల్వలు వున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఇఒ బి.బుజంగరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగాధరరావుకు సన్మానం



సన్మానిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ బుట్టాయగూడెంలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న గుర్రం గంగాధర రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నందుకు బుధవారం పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు బర్రింకలపాడులోని తన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ అవార్డు నిమిత్తం రూ.20 వేల క్యాష్ బహుమతి, మెమెంటో, మెడల్, సర్టిఫికెట్లను ముఖ్యమంత్రి చేతుల మీదుగా గంగాధరరావు అందుకున్నారు. అంతకుముందు ఈయన దొరమామిడి పంచాయతీ సెక్రటరీగా 2006-2007 సంవత్సరంలో పనిచేశారు. 2007 డిఎస్‌సిలో బయాలజీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగాన్ని ప్రారంభించారు. అనంతరం లక్కవరం, తిరుమలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బుట్టాయగూడెం వచ్చారు. ఈయన 8, 9 తరగతుల జీవశాస్త్ర పాఠ్యపుస్తక రచయితగా పనిచేశారు. ఎస్‌సిఆర్‌టిలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ఉంటూ అనేక రాష్ట్ర, జిల్లా స్థాయి టీచర్స్ ట్రెయినింగ్స్‌ని ఇచ్చారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు అవసరమైన యూట్యూబ్ లెసన్స్, లోకాస్ట్.. నోకాస్ట్ అభ్యసన సామాగ్రి, అలాగే సైన్స్ మ్యాజికల్ ఇన్‌స్టుమెంట్స్‌ని తయారు చేశారు. ఐసిటి స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా కూడా పనిచేశారు. టెక్నాలజీ, యాప్స్‌ను ఉపయోగించుకుని విద్యార్థులకు పాఠాలు చెప్పడంలో మంచి పట్టుంది. గతంలో ఈయన తయారుచేసిన ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సర్వశిక్ష అభియాన్‌లో స్టేట్ సబ్జెక్ట్ కమిటీ ఎక్స్‌పెర్ట్‌గా పనిచేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విజయకేతనం పుస్తక రచయితగా పనిచేశారు. ప్రస్తుతం బయాలజీ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, స్కౌట్ అండ్ గైడ్ జిల్లా ప్రోగ్రామ్ కమిటీ కన్వీనర్‌గా, జనవిజ్ఞానవేదిక సభ్యుడిగా కొనసాగుతున్నారు. పెద్దలు, నాయకులు కరాటం రాంబాబు, కరాటం సాయి చంద్రమోహన్, కరాటం రెడ్డి బాబు బుట్టాయగూడెం గ్రామానికి, జిల్లాకి మంచి పేరు తీసుకొచ్చారని గంగాధర్‌ని కొనియడారు.

రహదారి లేక గ్రామస్తుల అవస్థలు..

అధికారులు స్పందించాలని కాలనీ వాసుల వేడుకోలు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ఊటసముద్రం గ్రామంలోని వైఎస్ఆర్ కాలనీలో రహదారి వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు కాలనీ వాసులు తీవ్ర నిరసన తెలియజేశారు. వర్షాల దాటికి పూర్తిగా రవాణా స్తంభించింది. జ్వరాలతో బాధపడుతున్న వారికి ఆర్ఎంపి డాక్టర్లు రావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లడానికి ఇబ్బందిపాలవుతున్నారు. నిత్యావసరాలకూ ఇబ్బంది ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. దీంతో గ్రామస్తులందరూ కలసి చందాలతో రోడ్డు వేసుకోవాలని చూస్తున్నారు. పంచాయతీ తీర్మానం ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా అధికారులు, కలెక్టర్, ఎంఎల్ఎ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ఎన్‌సిసి క్యాడెట్లకు సత్కారం



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమడోలు : భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విభాగం నుంచి సర్టిఫికెట్ల సాధనకు నిర్వహించిన ప్రస్తుత విద్యా సంవత్సరం అర్హత పరీక్షల్లో హాజరైన 32 మంది సర్టిఫికెట్లు సాధించారని కళాశాల ప్రధానాచార్యులు బి.రవికుమార్, సత్యనారాయణ తెలిపారు. దీనిలో భాగంగా బి విభాగం నుంచి 20 మంది, సి విభాగం నుంచి 12 మంది హాజరయ్యారని తెలిపారు. ఎన్‌సిసి క్యాడెట్‌లకు శిక్షణ ఇచ్చిన ఎన్‌సిసి అధికారి కెప్టెన్ కె.శివశంకర్ ను కళాశాలకు చెందిన ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఎన్‌సిసి క్యాడెట్‌లకు సర్టిఫికెట్లను 19వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ అమిత్ పాండే అందజేశారన్నారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. క్యాడెట్లను తగు రీతిలో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ఆచార్యులు మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను తట్టుకోవడం, క్రమశిక్షణతో మెలగడం ఎన్‌సిసి అలవాటు చేస్తుందని తెలిపారు. కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ కె.శివశంకర్ మాట్లాడుతూ కళాశాలలో 2011వ సంవత్సరం నుంచి వేలాది మంది ఎన్‌సిసి క్యాడెట్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు తన సహకారాన్ని అందజేశామన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి గాను కళాశాల వేదికగా ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ ఇచ్చేందుకు ఈనెల 19వ తేదీన అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

15న లేబర్ కార్యాలయం ముట్టడి

కొయ్యలగూడెం : ఈనెల 15వ తేదీన విజయవాడలో జరగనున్న లేబర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం, పొంగుటూరు, అచ్యుతాపురం, కన్నాపురం, ఎర్రంపేట ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించేందుకు ఈ పోరాటం జరుగుతోందన్నారు. అందరూ విజయవాడ ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల హామీలు అమలు చేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మారిన పేర్రాజు, సిహెచ్.నారాయణ, మేడిన కన్నయ్య, సూల ప్రసాద్, కె.పెద్దిరాజు, దాసరి గంగాధర్ రావు, అడపా నాగు, చదువుల అనిల్, దాసరి పృథ్వి పాల్గొన్నారు.

గ్రావెల్ ఏర్పాటుపై హర్షం

చింతలపూడి : మండలంలోని ప్రగడవరం, ముక్కంపాడు గ్రామానికి వెళ్లటానికి వీలు లేకుండా ఉందని, ముక్కంపాడు రోడ్డుకి సీసీ రోడ్డు వేయాలని గతంలో స్థానికులు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను కోరడంతో ఎంఎల్ఎ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు గ్రావెల్ వేశారు. వెంటనే సీసీ రోడ్డు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎర్రంపల్లి సొసైటీ చైర్మన్ తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డికి తాత్కాలికంగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేయగా ఎంఎల్ఎ ఆదేశాలకనుగుణంగా గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా గ్రావెల్ పోశారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

గాయపడిన యువకుడు మృతి

జీలుగుమిల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కామయ్యపాలెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి.మహేష్(23) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా లక్ష్మీపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన డ్రమ్ముని ఢీ కొట్టి బోల్తా పడ్డాడు. ఈ ఘటనలో యువకుడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ యువకుడు ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు.

వైద్యుడు అనుమానాస్పద మృతి

ఏలూరు స్పోర్ట్స్ : కొంతకాలంగా ఆశ్రమం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం ఎరికపాలెం గ్రామానికి చెందిన బత్తుల శివరామకృష్ణ(38) వైద్య విద్యను అభ్యసించి ప్రస్తుతం ఆశ్రమం ఆసుపత్రిలో ఇంటర్వ్యూ కేర్ యూనిట్ విభాగంలో వైద్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు ఇంకా వివాహం కాలేదు. ఆయన మంగళవారం మధ్యాహ్నం విధులకు హాజరు కావలసి ఉండగా బుధవారం ఉదయం 8 గంటల వరకు ఇంటి నుండి బయటకు రాలేదు. దీంతో ఆశ్రమం సెక్యూరిటీ సిబ్బంది తలుపులు తీసి లోనికి వెళ్లి చూడగా ఆయన మృతిచెంది పడి ఉన్నాడు. అయితే ఎనస్తీషియా అధిక మొత్తంలో తీసుకోవడంతో అతను మృతిచెందినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి హత్య కేసులో నిందితుల అరెస్ట్

ఏలూరు స్పోర్ట్స్ : ఒకపక్క ఆధిపత్య పోరు, మరోపక్క మహిళల విషయంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతన్ని అంతమొందిస్తే తిరుగులేని పట్టు ఆ ఏరియాలో సాధించవచ్చు అనుకున్న ఆ నిందితుడు తన అనుచరులతో కలిసి ఆ వ్యక్తిని పాసవికంగా 32 సార్లు కత్తిపోట్లు పొడిచి హతమార్చాడు. ఈ ఘటనలో ఏలూరు సబ్ డివిజనల్ పోలీసులు పది రోజుల వ్యవధిలో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. ఏలూరు నగరంలోని సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిఎస్‌పి శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రూరల్ మండలం కొమరోలు ఇందిరమ్మ కాలనీ వైఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో పూనూరు రాజేష్ స్థానికంగా పెద్దమనిషిగా వ్యవహరిస్తూ ఉంటాడు. ఈయన భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. ఈ క్రమంలో అతనికి అనుచరుడుగా బూరగా చిన్న నాని ఉండేవాడు. అయితే నాని రాజేష్ రోజు రోజుకు పెద్దవాడు అవుతున్నాడని, అందరూ అతని మాటే వింటున్నారని అక్కసు పెంచుకున్నాడు. అంతేకాకుండా రాజేష్ విదేశాలకు వెళ్లి వచ్చిన మహిళతో సన్నిహితంగా మెలిగేవాడు, అదే మహిళతో నాని కూడా సన్నిహితంగా మెలిగేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న రాజేష్ నానినీ మందలించి అతనిపై దాడి కూడా చేశాడు. దీంతో నాని రాజేష్‌పై మరింత అక్కసు పెంచుకున్నాడు. గతనెల 31వ తేదీన మధ్యాహ్నం ఇంటి వద్ద రాజేష్ భోజనం చేస్తున్న సమయంలో ఇంటికి వచ్చిన నాని అతనిని బయటికి పిలిచాడు. అప్పటికే అతని వెంట ఉన్న మరో ఐదుగురు బయటకు వచ్చిన రాజేష్‌ను ఒక్కసారిగా కత్తులతో దాడి చేశారు. అతనిపై విచక్షణారహితంగా 32 కత్తిపోట్లు పొడిచారు. అక్కడినుండి కారులో పరారయ్యారు. ఈ ఘటనపై రాజేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నానితో పాటు అతని అనుచరులుగా వ్యవహరిస్తున్న ఏలూరు పెన్షన్ లైన్‌కు చెందిన సామంతుల అజయ్ సూర్య అలియాస్ బేస్సి, ఏలూరు లక్ష్మీవారపు పేటకు చెందిన లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు, పాండురంగాపురానికి చెందిన సిగిరెడ్డి సుధాకర్ అలియాస్ సుధా, కొత్తపేటకు చెందిన ముగ్గిన షణ్ముఖ వేణుగోపాల్ అలియాస్ వేణు, గన్ బజార్‌కు చెందిన కటారి పూర్ణ చంద్రశేఖర్ ఈ హత్యకు సహకరించారని డిఎస్‌పి తెలిపారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా చేదించిన ఏలూరు వన్ టౌన్ సిఐ జి.సత్యనారాయణ, ఏలూరు టూ టౌన్ సిఐ అశోక్ కుమార్, ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు, ఎఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్స్ సత్యారావు, కానిస్టేబుల్ బి.నాగార్జున, ఆర్.మోహన్, పి.నాగరాజు, ఎండి రూహుల్లా, ఎన్.శేషు కుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

రసాయన రహిత సాగుపై దృష్టి సారించాలి : కలెక్టర్

భీమవరం : రసాయన రహిత వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన, పశు వైద్య, డిఆర్డిఎ శాఖలతో జిల్లా స్థాయి సమావేశం బుధవారం కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రసాయనక ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా, జీవసంబంధమైన పదార్థాలను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 75 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు నడుస్తోందన్నారు. నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద కొత్తగా 140 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సాగుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ఒక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న విధానం, ఇప్పటివరకు అమల్లో ఉన్న గ్రామాలు, అలాగే తాజాగా గుర్తించిన 140 కొత్త క్లస్టర్ వివరాలను సమగ్రంగా వివరించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.సూకరాజు, డిఆర్డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. కౌశలం సర్వే, పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్, వాట్సాప్ గవర్నెన్స్, జిబిటిఎస్ ఫైల్స్ అప్లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ నాగరాణి బుధవారం వర్క్ ఫ్రం హోం, ఐకెవైసి, వాహనాల ఆధార్ సీడింగ్, తల్లికి వందనం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలతో సమీక్షించారు. తల్లికి వందనం ఇంకా కొంత మంది తల్లుల బ్యాంకు ఖాతాలో నగదు జమకాకపోవడంపై సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. 5 నుండి ఏడేళ్ల మధ్య వయసు కలిగిన 15 నుండి 18 ఏళ్ల వయసు మధ్య గలిగిన పిల్లలందరికీ ఆధార్ బయోమెట్రిక్స్ అప్డేట్ చేయాలన్నారు. కౌశలం సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వాహన పోర్టల్లోని అన్ని రకాల వాహనాలకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు మొబైల్ సేవలే కీలకం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రస్తుత డిజిటల్ విప్లవంలో మొబైల్ ద్వారా అందించే సేవలు కీలకం కానున్నాయని కాబి ఇంటర్నేషనల్ సంస్థ అధికారి ప్రతినిధి మధు మంజరి అన్నారు. బుధవారం మార్టేరు ఎన్.జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో జరిగిన రెండో రోజు మొబైల్ శిక్షణ అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, కాబి ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్లాంట్వైజ్ ప్లస్ మొబైల్ అప్లికేషన్ సభ్యత్వంపై బి.శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ విప్లవం కారణంగా ప్రజలంతా సెల్ఫోన్ ఉపయోగించి అన్ని పనులూ చేస్తున్నారని, దానికి ప్రత్యక్ష ఉదాహరణ చిన్న చిన్న దుకాణాల్లో కూడా ఫోన్ పే, గూగుల్ పే, పేటియం వంటి అప్లికేషన్ల ద్వారా విక్రయాలు జరగడమని తెలిపారు. కాబి నుండి మధు మంజరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఇఇగా రమణమూర్తి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

హౌసింగ్ ఇఇగా రమణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన భీమవరం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన రమణ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయనను సబ్ డివిజన్లోని డిఇ, ఎఇలు ఇతర సిబ్బంది బొకేలు అందించి అభినందనలు తెలిపారు.

లక్ష్మణేశ్వరం సొసైటీ చైర్మన్గా పార్థసారథి

ప్రజాశక్తి - నరసాపురం



లక్ష్మణేశ్వరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్గా చాగంటి పార్థసారథి నియమితులయ్యారు. ఆయనతో పాటు త్రిసభ్య కమిటీ సభ్యులుగా దొంగ రామలక్ష్మి, గుండుబోయిన వెంకటేశ్వర రావు నియమితులయ్యారు. పార్థసారథి లక్ష్మణేశ్వరం గ్రామ సర్పంచిగా పనిచేశారు. పార్థసారథి చైర్మన్గా నియమితులవ్వడం పట్ల విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడుతో పాటు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

పూరి గుడిసె దగ్ధంపై విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ వాసు

మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి పూరి గుడిసె దగ్ధమైన ఘటనపై పోలీసులు బుధవారం విచారణ ముమ్మరం చేశారు. ఆధారాల కోసం ప్రధాన రహదారి పొడవునా దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పుటేజ్ను పరిశీలించారు. ఆలయ సమీపంలోని దుకాణ యజమానుల నుంచి వివరాలను సేకరించారు. తొందర్లోనే విచారణ పూర్తి చేస్తామన్నారు. ఈ విచారణలో విఆర్ఒ దుసనపూడి సత్యనారాయణ, రెవెన్యూ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యా సంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాల అమ్మకం నిషేధించాలి

ప్రజాశక్తి - గణపవరం

పాఠశాలలు పరిసరాల్లో మాదకద్రవ్యాల అమ్మకాలను ప్రభుత్వం నిషేధించాలని కోరుతూ బుధవారం బువ్వనపల్లి జిల్లా పరిషత్ స్కూల్కు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్థానిక స్కూల్ పరిసరాల్లో మాదకద్రవ్యాలు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు వాటికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. ర్యాలీ అనంతరం షాపు యజమానులకు నోటీసులు ఇచ్చారు.

వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వడం లేదు

అధికార పార్టీ ఎంపిటిసిల ఆవేదన

పాలకోడేరు : 65 ఏళ్లు దాటిన వృద్ధుల ఇళ్లకు రేషన్ సరుకులు అందించడం లేదని అధికార పార్టీకి చెందిన ఎంపిటిసిలు ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు వృద్ధుల ఇళ్లకు మిషన్ లు పంపించి వేలిముద్రలు తీసుకుని వెళ్లిపోతున్నారే తప్ప రేషన్ సరుకులు ఇవ్వడం లేదన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తహశీల్దార్ ఎన్బి.భారతి మాట్లాడుతూ అర్హతున్న ప్రతి ఒక్కరూ ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం స్మార్ట్ రేషన్కార్డులు అందిస్తుందని, డీలర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయని అర్హులందరూ తీసుకోవాలని చెప్పారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్నామని చెప్పారు. దీనిపై శృంగవృక్షం జనసేన ఎంపిటిసి సవరం సత్యకృష్ణ, గొరగనమూడి టిడిపి ఎంపిటిసి లక్ష్మి పార్వతి మాట్లాడుతూ 65 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇంటికి రేషన్ సరుకులు అందించట్లేదని ఆరోపించారు. విసాకోడేరు, శృంగవృక్షం సర్పంచులు బొల్ల శ్రీనివాస్, జంగం సూరిబాబు మాట్లాడారు. అర్హత ఉన్న నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని అయితే ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు సైట్ పనిచేయట్లేదని, సమయం అయిపోయిందని చెబుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ భారతి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిడిఒ వి. రెడ్డియ్య, జెడ్పిటిసి పి.లక్ష్మీతులసి, ఉప ఎంపిపిలు, సర్పంచులు పాల్గొన్నారు.

'సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతి మనిషీ పరిపూర్ణ జీవితాన్ని ఆనందంగా అనుభవించాలని, సమస్యలు వస్తుంటాయని, వాటికి పరిష్కారాలు కూడా ఉంటాయని, ఆత్మహత్యలే శరణ్యమే కాదని ప్రముఖ మానసిక వైద్యులు జివి.రమణారావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, సైక్యాజిస్టు భీమవరం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని శాంతి హాస్పటల్లో బుధవారం నిర్వహించారు. రమణారావు మాట్లాడుతూ యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆత్మహత్యలు పిరికిపందల పని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు.

తణుకు : ఏ చిన్న సమస్య వచ్చినా దానికి చావే పరిష్కారం కాదని, సమస్యను పరిష్కరించే మార్గాలను అన్వేషించాలని న్యూరో సైకియాట్రిస్టు బి.రమేష్ కుమార్ సూచించారు. ఎస్కెఎస్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ డెవలప్మెంట్ సెల్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్కుమార్ మాట్లాడుతూ కుటుంబ కలహాలు, అప్పుల బాధలు, శారీరక, మానసిక ఆరోగ్యం సరిలేకపోవడం, ప్రేమ విఫలమవ్వడం, పోటీ పరీక్షల్లో, ఉద్యోగాల్లో తీవ్ర ఒత్తిడికి లోనవ్వడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 7 లక్షల మంది చనిపోతున్నారని, ఎక్కువగా 18 నుండి 30 సంవత్సరాల వయస్సు వారే ఉన్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ రమేష్కుమార్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరీబాయ్, ఉమెన్ డెవలప్మెంట్ సెల్ కన్వీనర్ వి.తులసీరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్.రమేష్, కెవి.శ్యామలాదేవి పాల్గొన్నారు. శ్రీ చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సంపై కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ ఏడుకొండలు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ రమేష్కుమార్ మాట్లాడారు.

నిరంతర స్ఫూర్తి ప్రదాత గారపాటి విమల

నేడు ఏలూరులో సంస్మరణ సభ



1937 జూన్ 28న అప్పటి కృష్ణా జిల్లా గుడివాడ తాలుకా నందివాడ మండలం పెదలింగాల గ్రామంలో గారపాటి విమల జన్మించారు. తల్లిదండ్రులు పాతూరి శ్రీరాములు, వెంకట సుబ్బమ్మ, అన్నయ్య పాతూరి వెంకటేశ్వరరావు, అక్కలు ధనలక్ష్మి, శ్రీలక్ష్మి, కమల. తొమ్మిది సంవత్సరాల వరకూ స్వగ్రామంలోనే ఆమె విద్యాభ్యాసం సాగించారు. అయితే విమల సోదరులు పాతూరి వెంకటేశ్వరరావు విద్యార్థి సంఘంలో చురుగ్గా పని చేస్తూ తేలప్రోలు గ్రామంలో ఉండటంతో విమల విద్యాభ్యాసం నిమిత్తం అక్కడికి వెళ్లారు. అన్నయ్య ఒకపక్క ట్యూషన్లు చెబుతూ, మరోపక్క పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉండేవారు. తెలంగాణా సాయుధ పోరాటం సమయంలో కమ్యూనిస్టు నాయకులపై కూంబింగ్ జరిగేది. కమ్యూనిస్టులు ఉన్న ఇళ్లను గుర్తించి ధ్వంసం చేసేవారు. ఆ విధంగా ఆంధ్రాలో ఉంటున్న పాతూరి వెంకటేశ్వరరావు ఇంటిని ధ్వంసం చేశారు. దీంతో వెంకటేశ్వరరావు తేలప్రోలు నుండి పొట్టిపాడు వచ్చి ట్యూషన్లు చెప్పడం మొదలు పెట్టారు. అట్లూరి శ్రీమన్నారాయణ, అన్నే రామారావు తదితరులతో విమల సోదరుడు ఉద్యమాల్లో ఉండేవారు. నండూరి ప్రసాదరావు, మానికొండ సుబ్బారావు వంటివారు అండర్గ్రౌండ్లో ఉన్నప్పుడు కొరియర్గా పని చేశారు. పాతూరి వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు ఉద్యమాల్లో ఉండటంతో ఆ ప్రభావం కుటుంబంపై పడింది. తర్వాత పొట్టిపాడు నుంచి అంపాపురం వెళ్లాల్సి వచ్చింది. అంపాపురం అంటే మేనమామ నందిగం శేషయ్య ఊరు. తర్వాత తేలప్రోలు ఫోర్తు ఫారం చదవడానికి విమల వెళ్లారు. అక్కడ 8వ తరగతి వరకూ చదివారు. తొమ్మిదో తరగతి చదవాల్సి వచ్చేసరికి దూరప్రాంతాలకు పంపాల్సి వస్తుందని చదువు ఆపించారు.

విమల చదువుకుంటూ ఉండగా ప్రజానాట్యమండలిలో నాటకాల్లో పాల్గొనేవారు. 'మా భూమి' తదితర నాటకాల్లో పాల్గొన్నారు. దీనికి ఆమె అన్నయ్య వెంకటేశ్వరరావు ప్రోత్సాహం ఎంతో ఉంది. చదువుకు మధ్యలో బ్రేక్ రావడం వల్ల ఆమె అన్నయ్య, మేనమామ ఆలోచించి విజయవాడలో ఆర్సిఎం ట్రెయినింగ్ స్కూల్ (సరస్వతి టాకీస్ ఎదురుగా)లో చేర్పించారు. 1953 నుండి 1955 అంటే రెండు సంవత్సరాలు విమల అక్కడే చదువుకున్నారు. 1955లో తిరిగి ఇంటికి వచ్చారు. హైర్ గ్రాండ్ ట్రెయినింగ్లో 8 పాస్ అయ్యారు.

విమల వివాహం, కుటుంబ నేపథ్యం

విమలకు 1955 ఏప్రిల్ 25న గారపాటి తాతన్న (సుబ్బయ్య)గారితో వివాహం జరిగింది. అన్నే రామారావు ఈ పెళ్లి సంబంధం తీసుకొచ్చారు. పెళ్లికి ముందే తాతన్న ఎమర్జెన్సీ కాలంలో మూడున్నర సంవత్సరాలు జైలులో ఉన్నారు. కన్నేటి కాశియ్య, పూర్ణచంద్రరావు, గున్నపనేని రాధాకృష్ణ తదితరులతో తాతన్న కడలూరు జైలులో ఉన్నారు. తాతన్న ఎమర్జెన్సీ కాలంలో పార్టీ నాయకత్వానికి కొరియర్గా పనిచేశారు. జైలు నుంచి విడుదలైన తరువాత పార్టీ జిల్లా ఆఫీసులో ఆఫీసు కార్యదర్శిగా పనిచేశారు. ఆ తరువాత పిల్లలు పుట్టడం కుటుంబ బాధ్యతలు పెరగడంతో ఆఫీసు బాధ్యతల నుండి తప్పుకున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం చిన్నచిన్న కాంట్రాక్టులు చేయడం ప్రారంభించారు. 1955లో పెళ్లి అయిన నాటి నుండి 11 సంవత్సరాలపాటు ఏలూరు వన్టౌన్ పడమర వీధిలోని జోగి మేడ దగ్గర నివాసం ఉన్నారు. విమలగారు ఏలూరు కాపురానికి వచ్చాక ఇక్కడ అన్నే అనసూయగారితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి అనసూయ తుదిశ్వాస విడిచే వరకూ ఆమె పాల్గొన్న అన్ని ఉద్యమాల్లోనూ విమల పాలుపంచుకునేవారు. ఏలూరు చుట్టూ ఉన్న గ్రామాలతోపాటు, కొల్లేరు గ్రామాలు, పెదపాడు, చింతలపూడి, దెందులూరు, భీమడోలు, ద్వారకాతిరుమల తదితర ప్రాంతాల్లో అనేక భూఉద్యమాల్లో అన్నే వెంకటేశ్వరరావు, అనసూయతో కలిసి పాల్గొన్నారు.

1957 సెప్టెంబర్లో గాంధీ స్కూలు (12 పంపుల స్కూలు)లో టీచర్గా చేరారు. అప్పటికే మున్సిపాల్టీలో వీరమాచనేని విమలాదేవి ఉన్నారు. ఫిమేల్ జిఒ తీసుకొచ్చి విమలకు టీచర్ ఉద్యోగం వేయించారు. తన వృత్తికాలంలో దాదాపు 12 స్కూళ్లలో విమల పని చేశారు. ఏలూరు అశోకవర్ధన స్కూల్లో పనిచేస్తూ రిటైరయ్యారు.

ఉద్యమాల అనుభవాలు

ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉమ్మడి ఉపాధ్యాయ సంఘం ఉద్యమాల్లో పాల్గొనేవారు. అప్పట్లో ఉపాధ్యాయులకు జీతం నెలకు రూ.60 ఇచ్చేవారు. అవి కూడా నెలనెలా ఇచ్చేవారు కాదు. ఉమ్మడి ఉపాధ్యాయ ఉద్యమ నేత వెంకట సుబ్బారావు ఉద్యమాల్లో పాల్గొనాలని విమలను ప్రోత్సహించేవారు. యుటిఎఫ్ ఏర్పాటయ్యాక చెన్నుపాటి లక్ష్మయ్య ప్రోత్సహించారు. తనవంతుగా విమల యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేశారు. రిటైరయ్యే నాటికి ఎం.సుబ్బారావు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. విమల రిటైరైనప్పుడు స్కూల్లో సన్మానం చేస్తామంటే వద్దని చెప్పారు.

విమల ఒకపక్క ఉపాధ్యాయ ఉద్యమాల్లో పాల్గొంటూనే అన్నే అనసూయ పరిచయంతో మహిళా ఉద్యమాలు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల్లో పాల్గొనేవారు. ప్రధానంగా మహిళా ఉద్యమాల్లో పని చేయడానికి అనసూయమ్మే స్ఫూర్తి. స్కూల్లో పాఠాలు చెబుతుండగా చివరి పీరియడ్ డ్రిల్ సమయంలో అనసూయమ్మ వచ్చి మా విమలను పంపండి ప్రజల సమస్యలపై వెళ్తాం అని చెప్పి తీసుకెళ్లేవారు. స్కూలు హెడ్ మాస్టారు కూడా వెంటనే పంపించేవారు. 1996లో ఐద్వా కమిటీ సభ్యులుగా వచ్చారు. 1998లో ఏలూరు డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. అప్పట్లో అధ్యక్షులుగా గారపాటి లలిత (కొవ్వలి) పని చేశారు. లలిత తరువాత గొట్టాపు రంగమణి, షేక్ సమీమ, గుత్తికొండ విజయ అధ్యక్షులుగా ఉండగా విమల కార్యదర్శిగా పని చేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

ఐద్వా ద్వారా ప్రధానంగా జిల్లాలో లిక్కర్ షాపులు వేలం నిర్వహిస్తున్నప్పుడు ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆ సందర్భంగా అన్నే అనసూయ, జి.విజయలక్ష్మి, విజయ తదితరులతో కలిసి అరెస్టయ్యారు. 2011లో మాదేపల్లిలో ఒక దుర్మార్గుడు ఎనిమిదేళ్ల బాలికను అత్యాచారం చేసి చంపేసిన ఘటనలో గ్రామస్తులను సమీకరించి ఆందోళన చేశారు. అప్పటి డిఎస్పి సరిత కేసు పకడ్బందీగా దర్యాప్తు చేస్తుండటంతో ఆ దుర్మార్గుడు ఏలూరులో జనసందోహం మధ్య బ్రిడ్జిపై నుండి దూకి మృతి చెందాడు.

2007లో సిపిఎం జిల్లా కమిటీ చేపట్టిన పాదయాత్రలో 65 సంవత్సరాల వయసులో విమల, 75 సంవత్సరాల వయసులో అనసూయమ్మ పాల్గొనడం నేటి యువ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారు. చింతలపూడి తాలూకా ప్రగడవరంలో 200 ఎకరాల భూమిని దళితులు, పేదలకు పంచిన ఉద్యమంలో అన్నే వెంకటేశ్వరరావు నాయకత్వంలో అనసూయమ్మతో కలిసి పాల్గొన్నారు. కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, ఆగడాలలంక, ప్రత్తికోళ్లలంక గ్రామాల్లో దళితులు, బిసిలు పేదలకు భూముల పంపిణీ ఉద్యమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు రిక్షా, ఆటో ఛార్జీలకు డబ్బులు ఖర్చు చేస్తే సంఘం నిధి తగ్గిపోతుందని, అది ఉంటే ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడతాయని గ్రామాల్లో నడిచి తిరిగేవారు అనసూయమ్మ, విమలమ్మ.

జిల్లా మహిళా ఉద్యమ భవన నిర్మాణానికి కృషి

ఏలూరులో మహిళా సంఘం కార్యక్రమాలకు అన్నే అనసూయమ్మతో కలిసి నిధి వసూళ్లకు తిరుగుతున్నప్పుడే డాక్టర్ ఎంఎల్వి.ప్రసాద్ సతీమణి లక్ష్మీ మీరు మహిళల కోసం ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నారు కదా, మీ ఆఫీసు ఎక్కడ అని అడిగారు. దీంతో పార్టీ ఆఫీసు నుంచి పనిచేస్తున్నాం అని చెప్పారు. నా వంతుగా రూ.10 వేలు ఇస్తాను, ఆఫీసు నిర్మాణం చేయండి అన్నారు. అంతే వెంటనే పార్టీ నాయకత్వం వద్ద ఆ ప్రతిపాదన పెట్టారు. అప్పటికే అన్నే వెంకటేశ్వరరావు పేరుతో నడుస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఉద్యమ భవనంలో ఖాళీ స్థలంలో మహిళా ఉద్యమ భవనం నిర్మించుకోవచ్చని పార్టీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయి. హైదరాబాద్ వెళ్లి సినీ నటులు శ్రీకాంత్, తమ్మారెడ్డి భరద్వాజ్ తదితరులను కలిసి విరాళాలు సేకరించారు. జి.విజయలక్ష్మి, జి.విజయ వారితో కలిసి పని చేశారు. పాలకొల్లు, భీమవరం ప్రాంతంలో ప్రభావతి, తణుకు ప్రాంతంలో అజయకుమారి, ఇతర మహిళా నాయకత్వం ఆ ప్రాంతాల్లో నిధులు వసూలు చేశారు. హైదరాబాద్లో అల్లూరి మన్మోహిని (అమ్మాజి) రాష్ట్ర ఐద్వా నాయకత్వంతో సహాయ సహకారాలు అందించారు. మొత్తానికి ఉమ్మడి పశ్చిమగోదావరి ఐద్వా జిల్లా భవనం నిర్మాణం పూర్తి చేశారు. తెలంగాణా సాయుధ పోరాట నేత మల్లు స్వరాజ్యంతో 2012లో ఆ భవనాన్ని ప్రారంభించారు.

ఏలూరులో మహిళా ఉచిత న్యాయ సహాయ కేంద్రం ఏర్పాటు

మహిళలకు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏదైనా చేయాలని, అప్పటికే పాలకొల్లులో ఐద్వాగా నడుపుతున్న ఉచిత మహిళా న్యాయ సహాయ కేంద్రాన్ని ఏలూరులో నడపాలని నిర్ణయించారు. అప్పటికే 3 నెలలుగా ఓ డాక్టరు ఇంటిపై నడుపుతున్న ఉచిత మహిళా న్యాయ సహాయ కేంద్రాన్ని నూతన భవనంలో నడపడం ప్రారంభించారు. గౌరవాధ్యక్షులుగా అనసూయ, కార్యదర్శిగా జి.విజయలక్ష్మి, లీగల్ సలహాదారులుగా వి.శైలజ, ఐద్వా ఆఫీసు బేరర్స్ అంతా కమిటీగా ఏర్పడి నడిపారు. 2020లో కరోనా వచ్చాక కుంటుపడింది. 2021లో జి.విజయలక్ష్మి మృతి చెందడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

పెదపాడులో ప్రజా సంఘాల భవనం నిర్మాణం

ఏలూరు డివిజన్లో పెదపాడు ప్రాంతం ఒకప్పుడు పార్టీ ఉద్యమ కేంద్రంగా ఉండేది. నర్రా ఆంజనేయులు తదితరులు నాయకత్వంలో చాలామంది చురుగ్గా పని చేసేవారు. పెదపాడు మండల కేంద్రంలో ఒక ఖాళీ స్థలాన్ని చంద్రం మేనల్లుడు ఇచ్చారు. దానికి గండపనేని సురేష్, నర్రా ఆంజనేయులు మనవడు బాబీ తదితరుల సహకారంతో అక్కడ ఆఫీసు నిర్మించారు.

విమలమ్మ అన్నే అనసూయమ్మతో కలిసి ఏటా జనవరి 1వ తేదీనే పార్టీ సభ్యత్వం రెన్యువల్ చేసుకోవడం ద్వారా నేటి తరం వారికి స్ఫూర్తిగా నిలిచేవారు.

విమలమ్మ జీవితంలో అటు ఉద్యోగం చేస్తున్నా ఇంటికి రాకుండా అన్నే అనసూయతో బయటకు వెళ్లిపోతున్నా, సెలవు రోజుల్లో సైతం బయటకు వెళ్తున్నా భర్త తాతన్నగాని, పిల్లలుగాని ఎవ్వరూ ఆమె కార్యక్రమాలకు అడ్డు చెప్పేవారు కాదని విమలమ్మ ఆనందపడేవారు. అయితే కాలు ఫ్రాక్చర్ అవ్వడం, బయటకు రాలేకపోవడంతో బాధపడేవారు.

ఐద్వా ఉద్యమ సభల్లో భాగంగా మహిళా నాయకులందరితో అండమాన్ నికోబార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వెళ్లడం వల్ల దేశంలో మహిళా ఉద్యమ అనుభవాలు తెలుసుకోగలిగాను అంటారు విమల. విమలమ్మ ఇల్లంతా అక్కలు, బావగారి పిల్లలతో ఎప్పుడూ 10 మందితో నిండుగా ఉండేది. వారి పిల్లలంతా 10వ తరగతి నుండి తమ ఇంటి వద్ద నుండే పైచదువులకు వెళ్లేవారని చెబుతుండేవారు. 2020లో భర్త తాతన్న (99) చనిపోవడంతో అప్పటి నుండి ఆమె అనారోగ్యంతో బయట తిరగడం లేదు. ఉద్యమాల్లో పలుమార్లు అనారోగ్యానికి గురైతే గారపాటి సత్యనారాయణ, అన్నే అనసూయమ్మే సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించేవారు.

విమలమ్మ ఉపాధ్యాయ వృత్తి విరమణ తర్వాత ఐద్వాలో చురుగ్గా పని చేశారు. ఒక తల్లి లాగా ఏదన్నా చిన్న సమస్య వచ్చినప్పుడు దానికి పరిష్కారం చెప్పేవారు. బంధువుల నుండి స్నేహితుల నుండి సంఘం అభివృద్ధి కోసం విరాళాలు సేకరించడంతో ముందుండేవారు. ఆమె అనారోగ్యంతో ఆగస్టు 30న తుదిశ్వాస విడిచారు. మరణానంతరం కూడా ఈ సమాజానికి ఉపయోగపడాలనే తపన ఆమెది. అందుకే తన భౌతికకాయం వైద్య పరిశోధనలకు ఉపయోగపడాలని కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆశ్రం ఆసుపత్రిలో విమల భౌతికకాయాన్ని అందజేశారు.

అలాంటి నిత్య స్ఫూర్తిదాయకులు మనకు దూరం కావడం బాధాకరం. ఆమె ఆదర్శాలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి. ఆ దిశగా అంతా కంకణబద్ధులై కృషి సాగిస్తాం.

- ఎ.రవి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి

నిరాడంబరత, అంకితభావం విమల సొంతం..

డి.రమాదేవి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విజయవాడ

ఐద్వా, ఉపాధ్యాయ నేత గారపాటి విమల నిరాడంబరతకు ప్రతిరూపం. ఆమె అంకిత భావం, వ్యక్తిత్వం నిరంతరం స్ఫూర్తిదాయకం. చిన్ననాటి నుంచి ఉద్యమ స్ఫూర్తితో పని చేయడమే కాకుండా కమ్యూనిస్టు చైతన్యంతో జీవించిన వ్యక్తి విమల. ఉపాధ్యాయినిగా పని చేస్తూనే వృత్తిపరమైన అంశాలతోపాటు మహిళల సమస్యల పరిష్కారానికి నిరంతరం తప్పించేవారు. అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయ దంపతుల ప్రోత్సాహంతో అటు మహిళల సమస్యతోపాటు వ్యవసాయ కూలీల సమస్యలపైనా, భూపోరాటాల్లోనూ భాగస్వాములయ్యారు. కార్యకర్తల పట్ల అమితమైన వాత్సల్యం కనబర్చేవారు. ఉద్యమాల్లో పాలుపంచుకుంటూనే విమల కుటుంబం ఉద్యమాలకు ఆర్థికంగానూ ఇతోధికంగా సాయపడేవారు. తాను తీసుకున్న, లేదా అప్పగించిన బాధ్యతలు నెరవేర్చడంలో ఎల్లప్పుడూ ముందుండేవారు. ఏలూరులో మహిళా సంఘ భవన నిర్మాణంలో క్రియాశీలకంగా ముఖ్యపాత్ర పోషించారు. నిరంతర స్ఫూర్తిదాయకులైన విమల మరణం బాధాకరం. ఆమెకు జోహర్లు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

ఉత్తేజపూరితం విమలమ్మ జీవిత ప్రస్థానం

బి.బలరాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

గారపాటి విమల ఉపాధ్యాయ, మహిళా ఉద్యమం, సిపిఎంలో నిబద్ధత, అంకితభావంతో పని చేశారు. ఆమె అభ్యుదయ, కమ్యూనిస్టు నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించి అదే చైతన్యాన్ని తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగించారు. గారపాటి తాతన్న గారితో వివాహం ఆమెను కమ్యూనిస్టు ఉద్యమం వైపు దృఢంగా నిలబడేలా చేసింది. అత్యంత క్రమశిక్షణ, ఉత్తమ బోధనతో ఆదర్శ ఉపాధ్యాయినిగా అందరి మన్ననలు పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం మహిళా ఉద్యమంలో చురుగ్గా పని చేశారు. అన్నే దంపతుల మార్గదర్శకంలో పార్టీ కార్యక్రమాలను చక్కగా నిర్వహించారు. జీవిత భాగస్వామి తాతన్నగారు, కుటుంబ సభ్యుల సహకారం ఆమె తన బాధ్యతలను పట్టుదలతో నిర్వర్తించేందుకు దోహదపడింది. పాదయాత్ర, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కార్యకర్తల పట్ల ప్రేమ, వాత్సల్యం తనదైన శైలిలో కనబరుస్తూ.. చిరునవ్వుతో పలుకరిస్తూ బాగా పని చేయమని ప్రోత్సహించేవారు. తమ కుటుంబ సభ్యులను సైతం తాతన్న, విమల దంపతులు సామాజిక స్పృహ కలిగిన వారుగా తీర్చిదిద్దారు. ఆరోగ్యం సహకరించకపోయినా తుదిశ్వాస వరకూ ఆమె పార్టీ, ఉద్యమం కోసం పడిన తపన, తాపత్రయం ఎంతో స్ఫూర్తిదాయకం. ఉత్తేజపూరితం. జీవించి ఉన్నప్పుడు ప్రజల కోసం పని చేయడమే కాక.. మరణానంతరం వైద్య పరిశోధనల నిమిత్తం తన శరీరాన్ని సైతం దానం చేశారు. విమలగారు ధన్యజీవి. ఆమెకు విప్లవ జోహార్లు. కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతి.

ధన్యజీవి గారపాటి విమల..

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర నాయకులు

గారపాటి విమల కమ్యూనిస్టు నేపథ్యం ఉన్న కుటుంబ నుంచి వచ్చారు. దీంతో చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు చైతన్యంతో ఎదిగారు. కమ్యూనిస్టు కుటుంబ నేపథ్యం ఉన్న తాతన్నగారితోనే వివాహం జరగడంతో ఆమె ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఉపాధ్యాయినిగా పని చేస్తూ యుటిఎఫ్లో క్రియాశీలంగా పని చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం ఏలూరు తాలుకాలో మహిళా ఉద్యమ అభివృద్ధికి తనదైన శైలిలో కృషి చేశారు. సిపిఎం ఏలూరు తాలుకా కమిటీ సభ్యురాలిగా వివిధ ఉద్యమాల్లో తాలుకా అంతా తిరుగుతూ క్రియాశీలంగా వ్యవహరించారు. మహిళా సంఘం భవనం నిర్మాణానికి ఇతోధికంగా కృషి చేశారు. విమల, తాతన్న దంపతులు ఉద్యమాలకు ఆర్థికంగానూ ఇతోధికంగా సహాయపడేవారు. ఆమె అనారోగ్యం బారిన పడి తిరగలేని పరిస్థితుల్లోనూ ఉద్యమాభివృద్ధి గురించి ఆరాతీస్తూ పేదల సమస్యల పరిష్కారానికి ఆసక్తి చూపారు. ఆమె మృతి పట్ల నివాళులర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.

స్ఫూర్తిదాయకులు విమల..

ఎ.శ్యామలారాణి, ఐద్వా ఏలూరు జిల్లా కార్యదర్శి

గారపాటి విమల ఉపాధ్యాయినిగా పని చేస్తూ మహిళల సమస్యలపైనా పని చేసేవారు. ఉపాధ్యాయినిగా వృత్తి విరమణ అనంతరం మహిళా ఉద్యమంలో ఎనలేని కృషి చేశారు. అన్నే అనసూయమ్మ ఆధ్వర్యంలో వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు ఏలూరులో మహిళా సంఘం భవనానికి గట్టి కృషి చేశారు. ఎంతోమంది మహిళా నేతలకు స్ఫూర్తిగా నిలిచారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న జిల్లాలో మహిళా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, మహిళల సమస్యలపై గట్టిగా నిలదీయాలని చెప్పేవారు. ఆమె మరణానంతరం భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల విజ్ఞానం కోసం ఆశ్రం మెడికల్ కాలేజీకి అందజేయటం గొప్ప విషయం. ఐద్వా నాయకులు, కార్యకర్తలు గారపాటి విమలను స్ఫూర్తిగా తీసుకుని పోరాటాలు సాగించాలి. విమల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. ఆమెకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నాం.

స్నేహశీలి గారపాటి విమల

పి.పూర్ణ, ఐద్వా పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి

గారపాటి విమలగారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్యురాలుగా పని చేశారు. ఉపాధ్యాయనిగా ఉద్యోగ విరమణ అనంతరం మహిళా సంఘంలో పని చేసేందుకు ఇష్టపడి వచ్చారు. ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొనేవారు. ఒక తల్లిలా ఏదైనా చిన్న సమస్య వచ్చినా దానికి పరిష్కారం చెప్పేవారు. విజయలక్ష్మి గారు, విమల గారు, గుత్తికొండ విజయగారు మంచి స్నేహితులు. వారు మాకు సలహాలు ఇస్తూ సంఘాన్ని ముందుకు నడిపించారు. బంధువులు, స్నేహితుల నుండి సంఘం అభివృద్ధికి విరాళాలు సేకరించడం ఆమె మాకు నేర్పించారు. అట్లాంటి మంచి మనిషి మాకు దూరం కావడం చాలా బాధాకరం. ఆమె ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తాం. ఆమెకు ఘన నివాళులర్పిస్తూ.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.

ప్రతి రైతుకి ఎరువులు పంపిణీ చేస్తాం

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా

పోలవరం : జిల్లాలో ప్రతి రైతుకు ఎరువులు అవసరమైన మేరకు పంపిణీ చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా అన్నారు. బుధవారం మండలంలోని ప్రగడపల్లి, వింజరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు జరుగుతున్న ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జిబాబు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, గునపర్తి చిన్ని పాల్గొన్నారు.

కంటి జాగ్రత్తలు పాటించాలి : వైద్యులు

దెందులూరు : స్పష్టమైన దృష్టికి ప్రతి ఒక్కరూ కంటి జాగ్రత్తలు పాటించాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ హేమలత అన్నారు. ఏలూరు రూరల్ మండల పరిధిలో మాదేపల్లి గ్రామంలో శివాలయం ప్రాంగణం వద్ద మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏలూరు రూరల్ మండలం టిడిపి సెక్రెటరీ పైడిపాటి శేఖర్ బాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రెటరీ పైడిపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. 15 మందికి ఆపరేషన్ కేటాయించినట్లు డాక్టర్ తెలిపారు. 20 మందికి కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. జాలిపూడి సొసైటీ ప్రెసిడెంట్ మోటేపల్లి పవన్ హరిచంద్ర కుమార్, మాదేపల్లి గ్రామ మాజీ ప్రెసిడెంట్ కోసూరి వెంకటసుబ్బారావు, నరహరిశెట్టి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలి : ఎఒ

ఉంగుటూరు : గోపీనాథపట్నం, చేబ్రోలులో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం పంట నమోదు అవుతుందని, ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను పొందాలంటే రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని ఎఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. అలాగే రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి జీవన ఎరువులు, నానో ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన పంట పండించవచ్చునని తెలిపారు. మండలంలోని అన్ని సొసైటీలలో యూరియా రైతులకు అందుబాటులో ఉంచామని, ప్రస్తుతం 130 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి అమరనాథ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతికి తోడ్పడాలి : ఎంపిడిఒలు


దెందులూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - ముసునూరు

పంచాయతీ పురోగతికి ప్రతి ఒక్క సర్పంచి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తప్పనిసరిగా తోడ్పడాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక(1.0) వెర్షన్ నుండి వెర్షన్ 2.0 పరివర్తన వ్యాప్తిపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చెత్త పరిశోధన కేంద్రం ద్వారా ఆయా గ్రామాలకు నిధులు ఎలా మంజూరు చేసుకోవాలో, అలాగే గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి తాగునీరు కుళాయి, వీధి లైట్లు, పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రామ్ బుధవారం నిర్వహించారు. ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. శిక్షణ తరగతులలో అన్ని శాఖలకు చెందిన అధికారులు, గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, ఎంపిపి ఆరేపల్లి శిరీష పాల్గొన్నారు.

భీమడోలు : రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ ముందస్తు అభివృద్ధి సూచిక(పిఎఐ) తయారు చేసుకుని, దానికి అనుగుణంగా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలులోని మండల పరిషత్ కార్యాలయ వేదికగా పిఎఐ వర్క్ షాప్ను బుధవారం నిర్వహించారు. ఒకరోజు పాటు జరిగిన కార్యక్రమానికి సమన్వయకర్తగా ఎంపిడిఒ పనిచేశారు. రిసోర్స్ పర్సన్లుగా అంబర్పేట గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరావు, సూరప్పగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య వ్యవహరించారు. వీరికి కార్యాలయ పరిపాలనాధికారి శర్మ, పంచాయతీ విస్తరణ అధికారి సుబ్బారావు సహకరించారు. పలువురు మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ (పిఎఐ 2.0) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల ప్రగతి సూచికలపై అవగాహన కల్పించడం, డేటా సమన్వయం, వాలిడేషన్ విధి విధానాలపై అవగాహన కల్పించడం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్పిటిసి వసంతరావు, సర్పంచులు, పలువురు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

దెందులూరు : పంచాయతీ పురోగతి అభివృద్ధి ప్రణాళిక (పిఎఐ 2.0) పై దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపిడిఒ కె.శ్రీదేవి అధ్యక్షతన బుధవారం జరిగింది. సదరు కార్యక్రమానికి ఎంపిటిసిలు, సర్పంచిలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

న్యాయం చేయాలని ఫిర్యాదుదారుల వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు గ్రామపంచాయతీపై విచారణ ప్రారంభమైంది. గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం, పరిపాలనపరమైన అంశాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణపై ఏలూరు డిఎల్పిఒ అమ్మాజీ బుధవారం గ్రామ సచివాలయంలో విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన దూబ చంద్రకాంత్, అల్లాబక్షు, రెడ్డి వెంకన్న పంచాయతీ వ్యవహారాలపై చేసిన ఫిర్యాదులపై గతనెల 13న డిఎల్డిఒ లక్ష్మి విచారణ చేపట్టి సాంకేతిక కారణాలతో వాయిదా వేశారు. 2013 నుంచి 2024 వరకు పంచాయితీ ఆదాయ వ్యయాలు, నిధుల వినియోగాలపై సమగ్రమైన విచారణ నిర్వహించేందుకుగాను ఫిర్యాదుదారులతోపాటు సర్పంచి అల్లు సుశీల, ఆయా సంవత్సరాల్లో పనిచేసిన పంచాయితీ కార్యదర్శులు శ్యాంసుందర్, రమేష్ విచారణకు హాజరయ్యారు. సందర్భంగా డిఎల్పిఒ అమ్మాజీని పెయ్యేరు అలేఖ్య వెంచర్ నివాసితులు కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. ఈ విచారణ ఫైనల్ విచారణ కావాలని, తమకు న్యాయం చేయాలని లేకుంటే కర్నూలు లోకాలతకు వెళ్తామన్నారు. డిఎల్పిఒ ఫిర్యాదుదారులతో ఆందోళన చెందవద్దని, మిమ్మల్ని సంతృప్తిపరిచేలా సమగ్ర విచారణ చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. 2014 నుంచి ఉన్న రికార్డులను సీజ్ చేసి అభియోగాలపై విచారణ నిమిత్తం ఏలూరు తీసుకువెళ్లారు.

నాకే పాపం తెలియదు : సర్పంచి సుశీల

నాకు ఏ పాపం తెలియదు, నాకు చదువు లేదు, అందుచేత కార్యదర్శి చెప్పిన చోట సంతకాలు చేసేదాన్ని. ప్రతిదీ నేనే చూసుకుంటాను నీకేమి సంబంధం లేదని కార్యదర్శి శ్యామ్ చెప్పేవాడు. అందుచేత సంతకాలు చేసి మోసపోయాను. ఒటిపి చెప్పడం తప్ప నాకు కార్యదర్శి ఏమి చెప్పేవాడు కాదు. కనీసం సర్పంచి గౌరవ వేతనం కూడా నాకు ఇవ్వలేదు. గౌరవ వేతనం గూర్చి అడిగితే జగన్ నీకు ఇస్తాడని చెప్పేవాడు. కార్యదర్శి సంతకాలు పెట్టమన్న కాడల్లా 100కు పైగా సంతకాలు పెట్టాను. అందుచేత అధికారులు సర్పంచి చెక్ పవర్ రద్దు చేశారన్ని అన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

యర్రంపల్లి సొసైటీ ఛైర్మన్ తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి

చింతలపూడి : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని యర్రంపల్లి సొసైటీ ఛైర్మన్, గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఫాతిమాపురం సోషల్ ఫారెస్ట్ అధికారుల ఆదేశాల మేరకు బుధవారం ప్రగడవరం మహాత్మా గాంధీ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హనుమంతరావు, హై స్కూల్ హెచ్ఎం సంపూర్ణ పాల్గొన్నారు.

ధర్మకర్త మండలి ఛైర్మన్గా వెంకటేశ్వరరావు

పోలవరం : మండలంలోని గూటాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్గా జనసేన నియోజకవర్గ ఐటి వింగ్ కోఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు(ఎవి), ధర్మకర్తలుగా కె.గంగా వీర వెంకట వల్లీ, ఎన్.నారాయణ రావు, కె.అనురాధ, పి.వెంకట నారాయణ శర్మ, రాజేష్, టి.వరలక్ష్మి, కె.పాపారత్నం, పి.వెంకటలక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు.

బొర్రంపాలెంలో ఎరువుల షాపుపై విజిలెన్స్ దాడులు

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో శ్రీఅన్నపూర్ణ ఫెర్టిలైజర్స్, జనరల్ మర్చంట్ షాపులో విజిలెన్స్, మండల వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎరువుల నిల్వల్లో తేడాలు గుర్తించడంతో పాటు అమ్మకం జరిగిన ఎరువులు బిల్లుల పుస్తకంలో నమోదు చేయకపోవడంతో రూ.6.98 లక్షల విలువ చేసే 39.585 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేసి షాపు యజమానిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎఒ మీరయ్య, ఎస్.రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

రొయ్య ఉక్కిరిబిక్కిరి..!

(మొదటి పేజీ నుంచి)

తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

గుదిబండగా వాతావరణ పరిస్థితులు

విపరీతమైన ఉక్కపోత, భారీ వర్షాలతో ఆక్వా రంగం ఒత్తిడికి గురవుతోంది. దీనికితోడు విద్యుత్ బిల్లులు భారంగా మారాయి. ఆక్వా రైతులకు భిన్న వాతావరణ పరిస్థితులు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఓవైపు మండే ఎండ, గంటల వ్యవధిలోనే మబ్బులు పట్టి జల్లులు కురవడం, తీవ్ర ఉక్కపోతతో చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోతోంది. సమస్య తలెత్తిన చెరువుల్లో రొయ్యలు దెబ్బతింటున్నాయి. మిగిలిన వాటిని కాపాడుకోవాలనే ఆశతో ఎప్పటికప్పుడు అనుకున్న కౌంట్ రాకుండానే రైతులు పట్టుబడులు పట్టక తప్పడం లేదు.

విపరీతమైన ఉక్కపోత, ఎండలు, వర్షాలు

మధ్యాహ్నం వరకూ విపరీతంగా ఎండ, అంతలోనే మబ్బులు పట్టి వర్షం కురవడంతో చెరువుల్లోని ఆక్సిజన్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు వస్తున్నాయి. దీంతో రొయ్యలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఎంత ఎండ ఉన్నా ఏరియేటర్లతో రొయ్యలకు సరిపడా వాతావరణాన్ని కల్పించే రైతులు ఉక్కపోత వాతావరణం ఉంటే మాత్రం డీలా పడిపోతున్నారు. ఓవైపు విపరీతమైన వేడి, అంతలోనే చల్లదనం రొయ్యలను వణికిస్తోంది. రెండు, మూడు రోజులపాటు అలాంటి పరిస్థితి ఉంటే రొయ్య మృత్యువాత పడుతోంది. అలాంటిది ఏకధాటిగా 20 రోజుల నుంచి వాతావరణం తేడాగా ఉండటంతో అనుకున్న కౌంట్ రాకపోయినా పట్టుబడి చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఓవైపు వ్యాధులు, మరోవైపు భిన్న వాతావరణ పరిస్థితులతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ రాయితీ కల్పించాలి

చేతికొచ్చిన రొయ్యలు వాతావరణ మార్పుల కారణంగా దెబ్బతినకూడదనే ఉద్దేశంతో రైతులు శ్రమిస్తున్నారు. చెరువుల్లో ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, ఏరియేటర్ల వినియోగానికి డీజిల్, ప్రోబయోటిక్స్, మినరల్స్ చల్లుతూ రొయ్యలను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల కేవలం పది రోజుల వ్యవధిలోనే ఎకరానికి సగటున 15 వేలకు మించి అదనంగా ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు.

వాతావరణ పరిస్థితులతో నష్టపోతున్నాం

వేగేశ్న బాలగణపతి వర్మ, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక

రెండు, మూడు రోజులపాటు అలాంటి పరిస్థితి ఉంటే సరుకు మత్స్యువాత పడుతుంది. అలాంటిది ఏకధాటిగా 20 రోజుల నుంచి వాతావరణం తేడాగా ఉండటంతో అనుకున్న కౌంట్ రాకపోయినా పట్టుబడి చేయాల్సి వస్తోంది. ఓ వైపు వ్యాధులు, మరో వైపు వాతావరణ పరిస్థితులతో నష్టపోతున్నాం. చెరువుల్లో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు ఏరియేటర్ల వినియోగిస్తూ, మరోపక్క ప్రోబయోటిక్స్, మినరల్స్ చల్లుతూ రొయ్యలను బతికించుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇలా కేవలం పది రోజుల వ్యవధిలోనే ఎకరానికి సగటున రూ.15 వేలకు మించి అదనంగా ఖర్చు చేస్తున్నాం. విద్యుత్పై రాయితీ కల్పిస్తే మేము కోలుకునే అవకాశం ఉంటుంది.

ఆక్సిజన్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ఇందిరా ప్రియదర్శిని మత్స్యశాఖ అధికారి, కాళ్ల

ఆక్సిజన్ కొరత నివారణకు చెరువుల్లో హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉండటంతో ఏరియేటర్లు నిరంతరం తిప్పాలి. బోట్లు. ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి చెరువులోని నీటిని రీసైక్లింగ్ చేయడంతో కెరటాలు వచ్చి ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. మేత తక్కువగా వేయాలి.

కిరాయిలు లేక.. కిస్తీలు కట్టలేక..!

(మొదటి పేజీ నుంచి)

చెబుతున్నారు. ఈ సందర్భంగా రాంబాబు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రాంబాబు ప్రతిరోజూ ఆటో తోలడం ద్వారా రూ.600కుపైగా సంపాదించేవారని, ఉచిత బస్సు పథకం వచ్చాక అది రూ.200కు పడిపోయిందని తెలిపారు. దీంతో ఆటో ఫైనాన్స్ చెల్లించలేకపోవడం, కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో నాలుగు రోజులుగా నిరాశగా ఉంటున్నాడని, మంగళవారం నాడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వాపోయారు.

ఆటో కార్మికునికి రూ.5 లక్షలు సాయం అందించాలి

ఆటో అండ్ ట్రాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటో కార్మికుడికి ప్రభుత్వం రూ.5 లక్షలు సాయం అందించాలని ఆటో అండ్ ట్రాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో కార్మికుడు రాంబాబును బుధవారం యూనియన్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది విద్యావంతులు, నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రైవేటు ఫైనాన్స్ నుండి అధిక వడ్డీలకు ఆటోలను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుతం వారు ఫైనాన్స్లు చెల్లించలేక ఆర్థికంగా కుటుంబాలు చితికిపోతున్నాయని అన్నారు. ఇప్పటికే స్పేర్పార్టులు, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని నాగేశ్వరరావు అన్నారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ తణుకు ఏరియా అధ్యక్షులు పంగం రాంబాబు మాట్లాడుతూ పథకాలు పెట్టేముందు ప్రభుత్వం ఆలోచించాలని, ఓట్ల రాజకీయంతో ఆటో కార్మికుల పొట్టను కొట్టొద్దని కోరారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెనుకాడబోమని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి విశ్వేశ్వరరావు, న్యాయవాది కామన మునిస్వామి పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

ముఖ్య వార్తలు

గురువారం 11 సెప్టెంబరు 2025

బాధితునికి వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

యలమంచిలి మండలం అడవిపాలెం సచివాలయంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న మల్లుల వెంకటరమణ ఇటీవల పక్షవాతానికి గురవడంతో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని పలువురు పాత్రికేయులు, మిత్రులు వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యులతో కలిసి బుధవారం అతనికి రూ.8 వేల నగదును అందించడంతో పాటు అవసరమైన మందులు అందిస్తామని హామీ ఇచ్చారు. క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకర్‌రావు, ఉపాధ్యక్షులు ఎం. బసవరాజు, ధనాని శ్రీరామ్మూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు.

17న మిద్దె తోటల పెంపకంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఉండి

ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 17వ తేదీన మిద్దె తోటల పెంపకంపై నిపుణులు వేణుగోపాలరావు నిర్వహించే అవగాహన సదస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహనా సదస్సులో మిద్దె తోటల పెంపకంలో బయోదార్ డికంపోజర్ వినియోగం గురించి వాటిని తయారీ చేయడం గురించి వివరిస్తారని, అదే విధంగా కోళ్ల పెంపకం తేనెటీగల పెంపకం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పిస్తారని తెలిపారు.

14న భవన నిర్మాణ కార్మికుల సమావేశం

ఆకివీడు ఈ నెల 14వ తేదీ ఆదివారం నిడదవోలులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం దుంపగడప గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం సంఘం కార్యదర్శి శేషగిరిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పాల్గొని మాట్లాడారు. 14న నిడదవోలులో జరిగే భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశానికి కార్మికులు పాల్గొనాలని తెలిపారు. బిఒసి కార్మికులు శేషగిరిరావు, శ్యామ్, శ్రీనివాస్, వెంకన్న, రాంబాబు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు ముగిసిన కుట్టు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు నెలల ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థినులు స్వయంగా కుట్టిన వస్త్రాలను ప్రదర్శించారు. వసుధ ఫౌండేషన్ తరపున పెన్మత్స బుద్ధరాజు మాట్లాడుతూ చదువుతోపాటు ఈ విధమైన స్వయం ఉపాధి కార్యక్రమాలు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. శిక్షకురాలు అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత కుట్టు శిక్షణ తరగతులను తమ కళాశాలలో నిర్వహించడం పట్ల వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకట రామరాజుకు కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్ మణిమాల విజయలక్ష్మి, జూలియా, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఐలమ్మను రజకులు స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి తాడేపల్లిగూడెం

భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన చిట్యాల ఐలమ్మను రజకులు స్ఫూర్తిగా తీసుకోవాలని రజక చైతన్య సేవా సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక యాగర్లపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఐలమ్మ 40వ వర్థంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రజక చైతన్య సేవా సంస్థ పట్టణ అధ్యక్షులు నారాయణపురపు నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి జొన్నాడ శ్రీనివాసు మాట్లాడుతూ ఐలమ్మ ధైర్య సాహసాలు ఎనలేనివన్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యశాలి ఐలమ్మ అన్నారు. ఆమె ఆశయ సాధనకు అందరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్డాల నరసింహారావు, యండమూరి మహేష్, కోటిచుక్కల అవతారం, బోగెల్లి రాంబాబు, జొన్నాడ కొండయ్య, వెలుదుటి శ్రీనివాసు, వేల్పూరి రమేష్, పాలమూరి అన్నవరం, పోలవరపు సతీశ్, తాపర్తి నాగరాజు, శీరం దాసు అప్పారావు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రకాశం

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం డిమాండ్ చేశారు. భీమవరం మండల ఎపిటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఐ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.పీటర్ , జిల్లా కార్యదర్శి ప్రసన్నకుమార్, మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

పెనుమంత్ర:ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకూ నిరసన వారం పేరిట చేపట్టిన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు పిఎన్‌వి.ప్రసాద్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమమే తమ ప్రభుత్వమని చెప్పారని, పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యం బకాయిలు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పడం లేదని తెలిపారు. ఉపాధ్యాయులే నా బలం అంటూనే బోధనేతర పనులతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 రోజులు రోజుకో ఉద్యమ కార్యాచరణ 'నిరసన వారం' చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

జిల్లా గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారిగా కె.శ్రీనివాస్ బుధవారం నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. శ్రీనివాస్ రాష్ట్ర ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ టి.శ్రీనివాస్ ఉన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు కోసూరి రామకృష్ణ ఆనందరాజు. లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సూచనలిచ్చారు రామకృష్ణ ఆనందరాజు మాట్లాడుతూ బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం తీసుకోవడం ఎంతైనా అవసరమన్నారు. 35 మంది గర్భిణులకు పోషకాహారం కిట్లు, పెరుగన్నం బాక్సులు అందించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.దినేష్, రోటరీ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు, కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలుని వైద్యానికి సాయం

ప్రజాశక్తి - తణుకు

తణుకు ఇరగవరం కాలనీలో నివసిస్తున్న ఎస్.రామకృష్ణ, శైలజ దంపతుల రెండేళ్ల వయస్సు గల కుమారుడు నాగగోవింద్ తల్లి వంట చేస్తుండగా వేడి గంజి ముఖం, శరీరంపై పడి తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. బాలుడి పరిస్థితి తెలిసిన శ్రీ తారకాపురి అధ్యక్షులు లయన్ వావిలాల పవన్‌కుమార్ రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం అందజేశారు. సెక్రటరీ రాంకుమార్ మాట్లాడుతూ శ్రీ తారకాపురి లయన్స్ క్లబ్ సేవలో కష్టంలో ఉన్న ఈ కుటుంబాన్ని ఆదుకోవడం తృప్తికరమైన సేవ అన్నారు. వావిలాల సరళాదేవి మాట్లాడారు. క్లబ్ డైరెక్టర్ వావిలాల వెంకట రమేష్, ఆకురాతి శ్రీనివాస్, వి.సుబ్రహ్మణ్యం, బత్తుల వెంకటరమణ, ఎ.సత్యనారాయణ, కె.శ్యామల, ఎ.గంగాధర్, జ్యోతి పాల్గొన్నారు.

25న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కాళ్ల

ఈ నెల 25న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులకు యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిఆర్‌ఎంకె.స్వామి, ఎం.శంకరరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం దొడ్డనపూడి హై స్కూల్లో యుటిఎఫ్ రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక, విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ రణభేరి కార్యక్రమం జరుగుతుందన్నారు. 25న విజయవాడలో భారీ బహిరంగ సభ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి విముక్తి చేయాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ పోరుబాట జరుగుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - నరసాపురం

తూర్పుతాళ్ల గ్రామంలో వినాయక చవితి నిమజ్జనంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెంది, గాయపడిన కుటుంబ సభ్యులను బుధవారం డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్నా) పరామర్శించారు. ఉమానాయుడు ట్రస్టు తరపున మృతుడు కడియం దినేష్ నాయుడు కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు, తిరుమల బుజ్జీ, గురుజు మురళీ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు, గాయపడిన కంచర్ల ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాగంటి పార్థసారథి, కొండవీటి ఉదయ్, చిన్న, పెంటపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంజేటివారిపాలెంలో 'పొలంబడి'

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలెంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ అబ్దుల్ రహీం రైతులకు పలు సూచనలు చేశారు. వరి చేలకు పట్టిన చీడ పీడలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎలుకల నివారణకు రైతులు పొలాల్లోని ఎలుకల బొరియలను గుర్తించి సామూహికంగా ఈ నెల 11, 12 తేదీల్లో నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

పాఠశాలకు గ్యాస్ స్టౌ అందజేత

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా తన సొంత డబ్బులతో కలిగొట్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధనపు యానీచరిత గ్యాస్ స్టవ్ అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో పౌష్టికాహారాన్ని తయారు చేసేందుకు అవసరమైన గ్యాస్ స్టవ్ పూర్తిగా పాడైపోవడంతో వెంటనే యానీచరిత గ్యాస్‌స్టవ్‌ను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. విద్యా కానుక కిట్‌లో భాగంగా విద్యార్థులకు అందించే షూలు సుమారు 15 మందికి రాకపోవడంతో వారికి కూడా షూలు కొనుగోలు చేసి ఇవ్వడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీసాల ఝాన్సీ, విద్యార్థులు ఉన్నారు.

భీమవరంలో అన్నదానం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం 31వ వార్డు కుమ్మర్ల వీధిలోని సీతారామాంజనేయ స్వామి రామాలయం వద్ద శ్రీవరసిద్ధి వినాయక చవితి 13వ వార్షిక మహోత్సవంలో భాగంగా సీతారామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను ఎంఎల్‌ఎ అంజిబాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. వేలాది మంది స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పండుగ పేరుతో ప్రజలకు అన్న సమారాధన చేయడం అభినందనీయమని ఎస్ఐ జి.వాసు అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో స్నేహ ఆటో యూనియన్ సభ్యులు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధనను ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవాగుణంతో ఉండాలని సూచించారు.

ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల బకాయిలు చెల్లించాలి

తణుకు:తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు 3 నెలల వేతన బకాయిలు, 35 నెలల పిఎఫ్ బకాయిలు తక్షణం చెల్లించాలని ఎపి మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. మెడికల్ కాంటాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించి ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య కార్మికలకు ఇస్తున్న అతి తక్కువ వేతనాలే నెలా నెలా సక్రమంగా ఇవ్వకపోవడంతో పస్తులతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పిఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పిఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదన్నారు. తక్షణం ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంటాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, భారతి, సిహెచ్ మంగమ్మ, పి.విజయలక్ష్మి, మెండి శ్రీను, వెంకటలక్ష్మి, ఎం.బేబి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ సత్యనారాయణ జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కవి, సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం విశ్వనాథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో అజరామంగా వెలుగొందిన కవి అన్నారు. కవితా వ్యవసాయ కావ్యవారాశిని పండించి రామాయణ కల్పవృక్షం వంటి ఉత్తమోత్తమ సాహిత్యాన్ని అందించి తెలుగులో మొట్టమొదట నపీఠ్ అవార్డ్ అందుకున్న కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ యామిని, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ భద్రాచలం, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.



ధర్నాలో నినదిస్తున్న నేతలు, కార్యకర్తలు

కుమ్మరిరేవులో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


కుమ్మరిరేవులో 25 సంవత్సరాలుగా నిరుపేదలు సిపిఎం నాయకత్వంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వాలు మారుతున్నా తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస సౌకర్యాలను కల్పించకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఇంటింటికి సిపిఎం కార్యక్రమంలో భాగంగా బుధవారం కుమ్మరి రేవు ప్రాంతంలో సిపిఎం బృందం పర్యటించింది. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కమిటీ సభ్యులు జె.గోపి, ఎం.ఇస్సాక్ మాట్లాడుతూ గత 25 ఏళ్లలో కుమ్మరిరేవు నివాసితుల సమస్యలను ఏ ప్రభుత్వమూ పరిష్కరించకపోవడం దారుణమన్నారు. కనీస సౌకర్యాలను వెంటనే అందించాలని, ఇళ్లపట్టాలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెం.30 ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరును స్మార్ట్ సిటీగా ప్రకటించినా నేటికీ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కుమ్మరి రేవులో ప్రజలు కనీస సౌకర్యాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో సమస్యలు పరిష్కరించకుంటే ప్రజలందరిని సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమానికి కుమ్మరిరేవు శాఖ కార్యదర్శి జి.ఏసుబాబు, ఇ.దుర్గారావు, త్రిమూర్తులమ్మ, రాణి, జిల్లా నాయకులు ఎం.నాగమణి, తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పిల్లి రామకృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

సచివాలయ ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తమ విద్యార్హతల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించాలని కోరుతూ ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యాన సచివాలయ ఉద్యోగులు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ భానుప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుండి విముక్తి కల్పించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతంగా పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరు సంవత్సరాలు పాటు ఒకే క్యాడర్లో సర్వీస్ నిర్వహించిన వారికి ఎఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు.

ఉంగుటూరు: సచివాలయ ఉద్యోగుల సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించకపోతే ప్రభుత్వం అమలు చేయబోయే కార్యక్రమాలను నిలుపుదల చేస్తామంటూ సిబ్బంది ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ సర్వేలతో విసిగిపోతున్నామని, గతంలో వాలంటీర్లు చేసే పని సచివాలయ సిబ్బందితో చేయిస్తున్నారని, వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వై.పూర్ణచంద్రప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు.



ఉంగుటూరు: ఎంపిడిఒకు వినతి అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రోడ్డు కోసం కొనసాగిన దీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు నుండి వెంప వెళ్లే రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండోరోజు బుధవారం కొనసాగింది. రహదారి నిర్మాణం చేపట్టే వరకు దీక్షలు విరమించబోమని ఐక్యవేదిక సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు ఆదూరి సాంబమూర్తి, పడమటిపాలెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

మీడియాలో 'ప్రజాశక్తి'కి ప్రత్యేక స్థానం

45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రజాశక్తికి ప్రత్యేక స్థానం ఉందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. సమస్యలను నిర్భయంగా రాసినప్పుడే అవి అధికారుల దృష్టికి వస్తాయని, తద్వారా ఆ సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. పత్రికలు ప్రజలకు, అధికారయంత్రాంగం, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రజాశక్తికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, డెస్క్ ఇన్‌ఛార్జి వివిఎస్ఎస్‌వి.ప్రసాద్, సిబ్బంది సీతారాం, సాంబమూర్తి, సత్యవతి, విలేకరులు శ్రీకాంత్, శ్యామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి సొసైటీలో ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సొసైటీలో ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చిన యూరియా కట్టలను ప్రస్తుతం ఒక్క రైతుకి ఒక్క కట్ట మాత్రమే ఇవ్వాల్సి ఉండగా ఒకే వ్యక్తికి 40 కట్టలు వరకు అనధికారికంగా అమ్మేశారు. దీంతో మిగిలిన రైతులకు యూరియా అందని పరిస్థితి ఏర్పడింది. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేయడంతో సొసైటీలో ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ వ్యవసాయ సహాయ సంచాలకులు బుజ్జిబాబు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఏజెన్సీ గ్రామాలకు ఇదే ఏకైక సొసైటీ కావడంతో రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడే పరిస్థితి దాపురించింది.

బధిరులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

35వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలెక్టర్ నాగరాణి

భీమవరం: బధిరులు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడేందుకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం డిఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ రామకృష్ణ సభా భవన్‌లో వెంకటేశ్వర బధిర పాఠశాల 35వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ 150 మంది వరకు విద్యార్థులు చదువుకునేవారని, నేడు 75 మంది మాత్రమే ఉన్నారన్నారు. జిల్లాలో బధిర వైకల్యం కలిగిన వారిని గుర్తించి ఈ పాఠశాలలో చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. తొలుత బధిర విద్యార్థుల నృత్య ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. కార్యక్రమంలో బధిర పాఠశాల మాజీ సభ్యులు పేరిచర్ల లక్ష్మణవర్మ, డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు జివి.నరసింహారాజు, కరస్పాండెంట్ జి.సత్యనారాయణరాజు, గన్నాబత్తుల తులసమ్మ పెదతాత ట్రస్ట్ అధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, బధిరుల సంఘం జిల్లా ఛైర్మన్ చెరుకువాడ రంగసాయి, శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాల ప్రిన్సిపల్ ఎ.తిరుపతిరావు, రాష్ట్ర చెవిటి సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మీనారాయణ, ట్రాన్స్‌లేటర్ కె.రాజు, ఆహ్వాన కమిటీ వైస్ ఛైర్మన్ జి.శ్రీనివాసరాజు, ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్‌వర్మ, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.గంగాధరన్, జనరల్ సెక్రటరీ సిహెచ్.తాతారావు, పూర్వ ప్రిన్సిపల్స్, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.











ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
ఏలూరు జిల్లా
సెప్టెంబర్ 2025
16 పేజీలు
Advt.feature 7

ప్రజలతో ప్రజాశక్తి



'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రజాశక్తి దినపత్రిక 45వ వసంతంలోకి ప్రవేశించింది. 1981 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి దినపత్రికగా వెలువడింది. 1980వ దశకంలో తెలుగునాట సాగిన అఖిలపక్ష రైతు ఉద్యమం, తదనంతరం ఎగసిన కాంగ్రెస్ వ్యతిరేక వెల్లువకు ఆలంబనగా నిలిచింది. 90వ దశకంలో దేశవ్యాప్తంగా వచ్చిన నయా ఉదారవాద విధానాలు, వాటితోపాటే రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సంస్కరణలతో ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని, రానున్న ప్రమాదాల గురించి వివరించింది. వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక, కర్షకులకు, విస్తార ప్రజా సమూహాలకు మద్దతుగా నిలిచింది. 2000 దశకంలో పాలకులు బషీర్‌బాగ్‌లో, ముదిగొండలో తూటాల వర్షం కురిపించి నిండు ప్రాణాలను బలిగొన్నా, ఆ ఉద్యమాలన్నింటిలోనూ ప్రచారాందోళన సాధనంగా ప్రజాశక్తి తనవంతు పాత్ర పోషించింది.

దేశంలో నయా ఉదారవాద విధానాలకు తోడు మతతత్వ శక్తులూ పెరిగాయి. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య విద్వేష సృష్టికి మతోన్మాదులు అయోధ్య మొదలు వారణాసి, మధుర వరకు అనేక వివాదాలను లేవనెత్తి రావణకాష్టాన్ని రగిలిస్తున్నారు. కార్పొరేట్ మతతత్వ కూటమి పాలనలో ప్రజాస్వామ్యం, స్వావలంబన, లౌకికతత్వం, సామాజిక న్యాయం హరించి వేయబడుతున్నాయి. రాజ్యాంగానికి ముప్పు ఏర్పడింది. నిరంకుశ ధోరణులు ప్రబలుతున్నాయి. అటవీ హక్కులకు పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, దేశానికి తీవ్ర హాని కలిగించే పరిణామాలన్నింటిపైనా పాఠకులకు ముందస్తు సమాచారాన్ని అందించడంలో ప్రజాశక్తి ముందుంది. దేశ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు, ప్రజల ఐక్యతను కాపాడడం కోసం అన్ని సందర్భాల్లోనూ నికరంగా నిలిచింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయరాదన్న సూత్రబద్ధ వైఖరికి కట్టుబడిన ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్ విభజనను వ్యతిరేకించి సమైక్యత కోసం నిలబడింది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కూడబలుక్కొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ముక్కలు చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, కడప ఉక్కు, విశాఖ రైల్వేజోన్... ఇలా ఎన్నో హామీలిచ్చినా అవి నీటి మీద రాతలుగా మారాయి. ఈ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర పాలకులను దోషులుగా నిలపడంలోనూ, రాష్ట్రంలోని పాలక, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అవకాశవాద వైఖరిని ఎండగట్టే విషయంలోనూ ప్రజాశక్తి ముక్కుసూటిగా వ్యవహరిస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచితే అది 1999లో గానీ, 2025లో గానీ పాలకుల విధానాలను, సంస్కరణల పేరిట సాగుతున్న దోపిడీని, విద్యుత్ భారాలను ప్రతిఘటించడానికి జనానికి సమాచారాన్ని ఇవ్వడంలో ముందుంది. తరగతుల విలీనం పేరిట విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వాటి పర్యవసానాలను ప్రజల ముందుంచింది. తమ హక్కుల సాధనకు ఉద్యమించే ఉద్యోగ, ఉపాధ్యాయులు, ..15లో

విదేశీ కోకో దిగుమతులు - నష్టాల్లో కోకో రైతులు

మన రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉంది. ఏలూరు జిల్లాతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉంది. ప్రపంచ కోకో ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలోని 20 దేశాల్లో 20వ స్థానంలో ఉంది. మన దేశ అవసరాలకు తగిన విధంగా ఇక్కడ ఉత్పత్తి లేదు. 80 శాతం కోకోను ఇతర దేశాల నుండి మన దేశం దిగుమతి చేసుకుంటుంది. ప్రపంచ కోకో ఉత్పత్తిలో 70 శాతం ఘనా, ఐవరీ కోస్ట్, నైజీరియా,



కామెమాన్ వంటి పశ్చిమ ఆఫ్రికా దేశాలదే. ఘనా, ఇండోనేషియా దేశాల నుండి మనం అత్యధికంగా కోకోను దిగుమతి చేసుకుంటున్నాం. కోకోను చాక్లెట్లు, కేకులు, వివిధ ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నారు.

మనం ఉత్పత్తి చేసిన కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో మోండలీజ్ (క్యాడ్బరీ) ప్రధాన కొనుగోలు కంపెనీగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి. గత సంవత్సరం కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1040 వరకు కొనుగోలు చేశాయి. గత సంవత్సరం రైతుకు కిలో కోకో గింజలకు సరాసరి ధర రూ.749 వచ్చింది. రాష్ట్రంలో 1992 నుండి కోకో తోటల సాగు ఉన్నా ఈ విధంగా ధర వచ్చిన సందర్భాలు లేవు. ఎన్నో కష్టనష్టాలకు గురై రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదు. పైగా అన్ సీజన్ (వర్షాకాలపు) గింజలు కొనుగోలు చేయడం లేదు. సీజన్ సీజన్‌కు కోకో గింజల ధర రోజురోజుకీ తగ్గించేస్తున్నారు. కంపెనీలు ఆడిందే ఆట, పాడిందే పాటగా ఉంది. మార్చి 6న ఏలూరు కలెక్టరేట్ ముందు వందలాది మంది కోకో రైతులు మహాధర్నా నిర్వహించారు. గుంటూరులోని ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రాలు అందజేశారు. ఏలూరులో మార్చి 12న ఉద్యాన శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో, మార్చి 17న గుంటూరు హార్టికల్చర్ డైరెక్టర్ కార్యాలయంలో కోకో రైతుల సంఘం ప్రతినిధుల సమక్షంలో కంపెనీలతో అధికారులు చర్చలు జరిపారు. కంపెనీల నుండి తగిన స్పందన రాలేదు.

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోకో రైతులు కోరినా కంపెనీలు కనీసంగా పట్టించుకోలేదు. కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్‌గా మారి ఇబ్బంది పెడుతున్నాయి. కంపెనీలను ఏమి చేయలేం అన్నట్లుగా ఉద్యాన శాఖాధికారులు మాట్లాడుతున్నారు.

కంపెనీలు రైతులను ఇబ్బందులు పెట్టే ధోరణితోనే ఉన్నాయి. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదు. కంపెనీలు మాత్రం అన్ సీజన్ గింజలు కొనలేమని, నాణ్యత లేదని బుకాయిస్తూ రోజురోజుకీ ధర తగ్గించేస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం కూడా కంపెనీలు కొనాలని గట్టిగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ చెప్పినా కంపెనీలు మాత్రం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంతకుముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకొచ్చారు. నాణ్యతా ప్రమాణాల గురించి మాట్లాడుతున్నారు. కంపెనీలు కొత్త గింజలు కొంటామని పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయం. కొత్త గింజలు రూ.650 నుండి రూ.600కు ఇప్పుడు రూ.550కు, రూ.500కు ధర తగ్గించారు. ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయి. అన్ సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240కు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ కొనుగోలు కూడా నామమాత్రమే. కోకో పంటను అత్యధికంగా సాగు చేస్తున్న ఏలూరు జిల్లాలోని ఒక్క పెదవేగి మండలంలోనే 500 టన్నుల వరకు అన్ సీజన్ (పాత గింజలు) రైతుల వద్ద నిల్వ ఉన్నాయి. మొత్తంగా రెండు వేల టన్నుల వరకు పాత కోకో గింజలు రైతులు వద్దనే ఉండిపోయాయి. అన్ సీజన్, సీజన్ గింజలకు కొద్ది తేడా ఉన్నా ఇప్పటి వరకు కంపెనీలు అవేమీ పట్టించుకోకుండా కొద్ది తేడాతో కొనుగోలు చేశాయి. ప్రస్తుతం పాత గింజలు కొనుగోలు చేయడం లేదు. అక్కడక్కడ కొనుగోలు చేసినా చాలా తక్కువ ధర ఇస్తున్నాయి. రైతులు గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల వద్ద ఉన్న గింజలు కొనుగోలు చేయకుండా వివిధ కంపెనీల ప్రతినిధులు, గింజల కొనుగోలుదారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఇంటింటికీ వచ్చి రైతులను బతిమలాడి కోకో గింజలు కొనుగోలు చేసిన ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులు ముఖం చాటేస్తున్నారు. పైగా నిల్వ ఉంచిన గింజలను 'పచ్చళ్లు పట్టుకోండి' అంటూ రైతులను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల ఎరువులు, పురుగుమందుల ధరలు, కూలీ ఖర్చులు పెరిగాయి. కోకో గింజలు ధర పెరిగిన తర్వాత కౌలు రేట్లు పెరిగాయి. ప్రస్తుతం ఎకరా కోకో తోటలకు రూ.లక్ష నుండి రూ.లక్ష 50 వేల వరకు కౌలు ఉంది. ఎకరాకు ఎరువులు, పురుగుమందులు, కూలీ ఖర్చులు రూ.60 వేల వరకు ఖర్చవుతున్నాయి. ప్రస్తుతం కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. అప్పుల ఊబిలో ..4లో

దేశవ్యాప్త ఖ్యాతి ఏలూరు నిమ్మ మార్కెట్ సొంతం

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

20వ శతాబ్దం మధ్యకాలంలోనే ఏర్పడిన ప్రత్యేక మార్కెట్ యార్డ్


మార్కెట్‌లో నిమ్మకాయలు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ఏలూరు నిమ్మ మార్కెట్ దేశవ్యాప్తంగా అత్యంత ప్రఖ్యాతి గాంచిన వ్యాపార కేంద్రంగా పేరొందింది. పశ్చిమగోదావరి జిల్లాలోని పలు మండలాల నుండి పెద్ద ఎత్తున నిమ్మకాయలు ఇక్కడకు వస్తూ ఉండటంతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతాయి.

ఆవిర్భావం, అభివృద్ధి..

ఏలూరు పరిసర ప్రాంతాలు ముఖ్యంగా పెదవేగి, దెందులూరు, నల్లజర్ల, లింగపాలెం వంటి మండలాలు నిమ్మకాయలు పండించటానికి అనుకూలమైన వాతావరణం కలిగి ఉండటం వల్ల ఇక్కడి రైతులు దశాబ్దాల క్రితం నుంచే విస్తారంగా నిమ్మకాయలు పండించడం ప్రారంభించారు. ఇది క్రమంగా పెద్ద ఎత్తున వ్యాపారానికి దారితీసింది.

20వ శతాబ్దం మధ్యకాలంలోనే ఏలూరులో ప్రత్యేక నిమ్మ మార్కెట్ యార్డు ఏర్పడి అప్పటి నుండి ఇది రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే అతిపెద్ద నిమ్మకాయల మార్కెట్లలో ఒకటిగా ఎదిగింది.

జాతీయ స్థాయిలో గుర్తింపు..

ఏలూరు నిమ్మకాయల మార్కెట్ దేశంలోనే అతి పెద్ద నిమ్మకాయల ఎగుమతి కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడి నుండి ప్రతిరోజూ 50కి పైగా లారీలు నిమ్మకాయలతో లోడవుతూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు తరలిపోతుంటాయి. వేసవి కాలంలో మార్కెట్ విలువ రోజుకు రూ.8 నుండి రూ.10 కోట్ల వరకు చేరుతుంది.

రైతుల ఉపాధి, ఆర్థిక ప్రాధాన్యం..

ఏలూరు నిమ్మ మార్కెట్ వేలాది మంది రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, కూలీలకు జీవనాధారంగా నిలుస్తుంది. సార్టింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనుల్లో పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. నిమ్మ సాగు రైతుల ఆదాయ వనరుగా మార్కెట్ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది.

ధరల మార్పులు, సమస్యలు..

సాధారణంగా వేసవి కాలంలో నిమ్మ ధరలు ఎక్కువగా ఉంటాయి. ఒక కిలో నిమ్మకాయల ధర రూ.90 నుంచి 100 వరకూ పెరుగుతుంది. అయితే అకాల వర్షాలు లేదా తీవ్ర వాతావరణ మార్పులు జరిగితే ధరలు ఒక్కసారిగా రూ.20 నుంచి 30కి పడిపోతాయి. వ్యాపారుల మధ్య కార్టెల్ ప్రవర్తన కారణంగా రైతులకు తగిన ధరలు రాకపోవడం తరచూ సమస్యగా మారింది.

ఆధునిక వాణిజ్య మార్పులు..

2017లో ప్రభుత్వం ఇ–నామ్ అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టింది. అయితే నిమ్మకాయలు త్వరగా పాడైపోయి ఉత్పత్తి కాకపోవడంతో రైతులు, వ్యాపారులు దీనిని వ్యతిరేకించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. వారు సంప్రదాయ వేలంపాట పద్ధతిని కొనసాగించాలని, సరైన కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తు అవకాశాలు..

ఏలూరు నిమ్మ కాయలకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో కూడా మంచి డిమాండ్ ఉంది. ఎగుమతి ప్రోత్సాహకాలు, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు, నేరుగా రైతు–వ్యాపారి కనెక్టివిటీ కల్పిస్తే మార్కెట్ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 2024లో ఎసిఐసి కెఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ వంటి సంస్థలు ఏలూరు నిమ్మ మార్కెట్‌లో రైతులకు లోజిస్టిక్స్, ఎగుమతులు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడానికి అవుట్‌రిచ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించడం ప్రారంభించాయి. ఏలూరు నిమ్మ మార్కెట్ కేవలం వాణిజ్య కేంద్రం మాత్రమే కాదు, రైతుల జీవనాధారం, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలమైన అడ్డా. కాలానుగుణ మార్పులు, ప్రభుత్వ విధానాలు, మార్కెట్ డిమాండ్ మొత్తం కలిపి ఏలూరు నిమ్మ మార్కెట్ చరిత్రను నిరంతరం రూపుదిద్దుతున్నాయి.


నిమ్మకాయలు మార్కెట్


వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

ప్రసిద్ధ క్షేత్రం.. పెద్దింట్లమ్మ ఆలయం

ప్రజాశక్తి – కైకలూరు

యాత్రికుల పాలిట కొంగుబంగారం.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెద్దింట్లమ్మ అమ్మవారు. కొల్లేటి సరస్సు నడిబొడ్డున కొలువై ఉన్న అమ్మవారి గురించి తెలుసుకుందాం.. కొల్లేటికోట అమ్మవారి ఆలయంలో జలదుర్గ అమ్మవారి విగ్రహం ఉంది. ఆలయంలో తొమ్మిది అడుగుల ఎత్తు కలిగి, విశాల నేత్రాలతో పద్మాసనంలో కొలువై ఉన్న అమ్మవారు పెద్దింట్లమ్మ. పార్వతీదేవి ప్రతిరూపంగా ప్రజలు అమ్మవారిని కొలుస్తుంటారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఒడిశ్శా తదితర ప్రాంతాల నుంచి యాత్రికులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఏటా పాల్గుణ శుద్ధ పాడ్యమి మొదలు పౌర్ణమి వరకూ అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతుంటాయి. పాల్గుణ శుద్ధ ద్వాదశి నాడు అమ్మవారికి మూడు మైళ్ల దూరంలోని గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వర స్వామితో కళ్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది.



పెద్దింట్లమ్మ ఆలయం

కొల్లేరు ప్రాంతం ప్రసిద్ధి చెందింది. కొల్లేటికోట లంక గ్రామాన్ని కొలనుపుణంగా, కొలనువీడుగా పిలిచేవారని శాసనాల ద్వారా తెలుస్తుంది. క్రీస్తు శకం 10, 11 శతాబ్దాల్లో వేంగిచాళుక్య రాజులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. క్రీ.శ 1076లో వీర విజయాదిత్య మరణంతో వేంగి చాళక్యుల పాలన అంతమైంది. చాళుక్యులకు తిరిగి రాజ్యాధికారం ఇవ్వడంతో మండలేశ్వర్ల తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు చేసిన వారిలో కొలనువీడు మండలేశ్వరుడైన తెలుగు భీముడు కూడా ఉన్నారు. బహు సాహసిగా వాసికెక్కిన తెలుగు భీముడు మిగిలిన తిరుగుబాటుదారులతో కలిసి పితృపురం చాళుక్యరాజైన విద్యార్థి చక్రవర్తిని రాజుగా చేశారు. ఆయనే పార్వతీదేవిని పెద్దమ్మగా కొలిచిన చక్రవర్తి. చైనా బౌద్ధమత ప్రచారకుడు హుయాన్ సాంగ్ ఈ కొల్లేటికోట సరస్సును ఒక మహత్తర తాగునీటి సరస్సుగా అభివర్ణించారు. దండి మహాకవి దశకుమార చరిత్రలో కొల్లేటికోట సరస్సును బహుసాహసి అయిన తెలుగు భీముడు గురించి గొప్పగా రాశారు. కొల్లేరు సరస్సును ప్రాచీనకాలంలో కునాళ సరస్సుగా పేరు ఉన్నట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు.

ఇక్కడికి ఎలా చేరాలంటే..

విజయవాడ నుంచి రైలు మార్గంలో భీమవరం వెళ్లే రైలు ఎక్కి కైకలూరులో దిగాలి. అక్కడ నుంచి ఆలపాడు వరకూ బస్సులో ప్రయాణించి ఏడు కిలోమీటర్ల రోడ్డు మార్గం ద్వారా కొల్లేటికోటకు చేరుకోవచ్చు. కొల్లేరు సరస్సులో పడవ ప్రయాణం ద్వారా పెద్దింట్లమ్మను దర్శించుకోవడం మరుపురాని అనుభూతి. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఈ ప్రాంత ప్రజల ఆనవాయితీ. ఇటీవల దేవాదాయ శాఖ నిధులు కేటాయించి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు యాత్రికుల నుంచి విరాళాలు సేకరించి అణివేటి మండపాన్ని నిర్మిస్తున్నారు.

విదేశీ కోకో దిగుమతులు – నష్టాల్లో కోకో రైతులు

(రెండో పేజీ నుంచి)

కూరుకుపోతున్నారు. కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తగినంతగా జోక్యం చేసుకోకపోతే కోకో రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కంపెనీలు రైతుకు తగిన ధర ఇవ్వడం లేదు. కాబట్టి వ్యత్యాసపు ధర ప్రభుత్వం చెల్లించే విధంగా రైతును ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలి. మన దేశ అవసరాలకు లక్షా 20 వేల టన్నుల అవసరం. ఇక్కడ దేశీయంగా ఉత్పత్తి జరుగుతున్నది 35 వేల టన్నులు మాత్రమే. మిగిలిన కోకోను దిగుమతి చేసుకుంటున్నాం. కోకో గింజల కంటే కోకో పొడి, బట్టర్ రూపంలో అత్యధికంగా దిగుమతులు జరుగుతున్నాయి. కంపెనీలు తమకు కావాల్సిన కోకోను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుని ఇక్కడ కోకో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎగుమతులు, దిగుమతుల విధానం వల్ల కోకో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వైపు నుండి తగిన జోక్యం లేదు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదలకు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. ఫలితంగా దేశీయంగా రైతు నష్టపోవాల్సి వస్తోంది. బహుళ జాతి కంపెనీల కబంధహస్తాల్లో కోకో రైతు నలిగిపోతున్నాడు. ధర గురించి అడిగితే అధికారులు సరఫరా–డిమాండ్ సూత్రం చెబుతున్నారు. 80 శాతం కోకోను దిగుమతి చేసుకుంటున్న మనదేశంలో సరఫరా ఉన్నట్లా.. లేనట్లా?. డిమాండ్ ఉన్నదిగాని సరఫరా లేదు. మరి ఈ పరిస్థితుల్లో కోకో రైతుకు మెరుగైన ధర రావాల్సిన అవసరం ఉంది. ఎందుకు రావడం లేదో సమాధానం లేదు. గత సంవత్సరం ఘనాలో పంట దెబ్బతిని దిగుబడులు లేవు కాబట్టి అంతర్జాతీయంగా కోకోకు డిమాండ్ పెరిగింది. ఈ సంవత్సరం ఆఫ్రికన్ దేశాల్లో దిగుబడులు పెరిగాయి కాబట్టి ధర తగ్గిందని చెబుతున్నారు. అయినా ప్రస్తుతం కిలో కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర రూ.700 వరకు ఉంది. ఈ ధర రైతుకు రావడం లేదు. పైగా కంపెనీలు రైతుల నుండి గింజలు కొనుగోలు చేయడం లేదు. ఇక్కడ రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు రైతులను నిలువుగా దోచుకుంటున్నాయి. కోకో గింజలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడం లేదు. ఆయిల్‌పామ్ గెలలకు కనీసంగా ఒక ఫార్ములా రూపొందించి ధర ఇస్తున్నారు. కొబ్బరి వంటి పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటిస్తున్నది. కోకో గింజలకు ఇంతవరకు ధర నిర్ణయించే ఒక ఫార్ములాను రూపొందించకపోవడం మరీ అన్యాయంగా ఉంది. కంపెనీలు ఎంత ధర చెబితే ఆ ధరకు మాత్రమే కోకో గింజలను రైతు అమ్ముకోవాలి తప్ప మరో మార్గం లేదు. కోకో గింజలకు నాణ్యత ప్రమాణాలు కూడా కంపెనీలే చెబుతున్నాయి. ప్రభుత్వాల ఆధీనంలో కంపెనీలు ఉన్నాయా, లేక ప్రభుత్వాలే కంపెనీల ఆధీనంలో ఉన్నాయా అన్నట్లుగా ఉంది. బహుళ జాతి కంపెనీలకు ఊడిగం చేసే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయని అర్థమవుతోంది. రైతు ఏమైపోయినా పాలకులకు అవసరం లేదు. కోకో రైతులను ఈ సంక్షోభం నుండి బయటపడేలా ప్రభుత్వాలు సరైన మార్కెటింగ్ చర్యలు చేపట్టకపోతే కోకో గింజల కొనుగోలు సమస్య తీవ్రమవుతుంది.

ధరల స్థిరీకరణ నిధి పథకం కోసం ప్రభుత్వాలు గొప్పగా చెబుతున్నాయి. పోరాటం చేస్తేనే అమలు చేశారు. కోకో గింజల ధర నిర్ణయానికి ఫార్ములా రూపొందించాలని కోకో రైతులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదు. ప్రస్తుతం కంపెనీలు ఇస్తున్న ధర వల్ల రైతులు నష్టపోతున్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత. విదేశీ కోకో గింజల దిగుమతుల నిలుపుదలకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి. రాష్ట్రంలో ఎక్కడా కోకో ప్రాసెసింగ్ యూనిట్లు లేవు. కోకో ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పి రైతుకు మంచి ధర వచ్చేలా ప్రభుత్వాలు శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో కొబ్బరి పంటలోనే కాకుండా ఆయిల్‌పామ్ అంతర పంటగా కోకోని అభివృద్ధి చేసేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి. కోకో అంతర పంట సాగు.. లాభాలు బాగు అంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప కోకో పంట దిగుబడులు పెరిగే విధంగా, మంచి ధర వచ్చే విధంగా ప్రభుత్వాల వద్ద ఇప్పటివరకు నిర్దిష్టమైన ప్రణాళిక లేదు. ఇంకా అధ్యయనం చేస్తున్నాం.. నివేదిక రూపొందిస్తున్నాం అంటూ ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉన్న కోకో సాగు విస్తీర్ణం పెంచడమే కాకుండా మంచి దిగుబడి, ధర వచ్చే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. వర్జీనియా పొగాకు వంటి పంటల కొనుగోలుకు ఏర్పాటు చేసిన విధంగా కోకోకు బోర్డు ఏర్పాటు చేసి మార్కెట్ సెంటర్స్ (ప్లాట్ ఫార్మ్స్) ఏర్పాటు చేసి వాటి ద్వారా కంపెనీలు వేలం ద్వారా కోకో గింజలు కొనుగోలు చేసే విధంగానైనా తగిన మార్కెటింగ్ విధానం కోసం రైతులతో సంప్రదించి ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ పరిస్థితుల్లో తమ సమస్యల పరిష్కారం కోసం కోకో రైతులు సంఘటితమై పోరాడటం తప్ప మరో మార్గం లేదు.

– కె. శ్రీనివాస్
ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏలూరు

స్కేటింగ్‌లో చిచ్చర పిడుగు

అంతర్జాతీయ యవనికపై మెరుపు - 14 ఏళ్లకే అంతర్జాతీయ పతకాలతో మన్ననలు


రాష్ట్రపతి చేతులమీదుగా బాల పురస్కార్ అందుకుంటున్న జెస్సికా

ప్రజాశక్తి - దెందులూరు

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు పెద్దలు. కొందరు పుట్టుకతోనే సహజ సామర్థ్యాలతో అందరిని మెప్పిస్తూ.. తనదైన ముద్ర వేసుకుంటారు. ఇదే కోవకు చెందిన 14 ఏళ్ల మాత్రపు జెస్సీరాజ్ కాళ్లకు చక్రాలు కట్టుకొని... రయ్యిన దూసుకుపోతూ అంతర్జాతీయ స్కేటింగ్ యవనికపై తారాలా ప్రకాశిస్తోంది. పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందంగా చిన్న వయసులోనే అనేక అంతర్జాతీయ పథకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తోంది. అమ్మానాన్నల అండతో సరదాగా స్కేటింగ్ రింగ్‌లోకి దిగిన చిన్నారి ఎన్నో పతకాలు సాధిస్తూ కన్న భూమికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి గడించి పెడుతోంది. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీతగా, ఆసియా రోలర్ స్కేటింగ్ రజత పతక విజేతగా అవతరించి అందరి మన్ననలు పొందుతోంది.



చంద్రబాబు చేతులమీదుగా అందుకుంటూ..

నాలుగేళ్లప్పుడు అనుభూతి..

నాలుగేళ్ల వయసులో అమ్మా నాన్న రాధ, సురేష్‌లు జెస్సికాను ఏలూరు ఇండోర్ స్టేడియానికి తీసుకెళ్లారు. అక్కడ స్కేటింగ్ రింగ్ చూపించి... సరదాగా.. నేర్చుకుంటావా అని అడిగారు. రింగ్‌లో చక్రాల మీద పరుగెట్టడం ఎంతో ముచ్చట అనిపించి సరే అంది. వెంటనే స్కేటింగ్ శిక్షణలో చేర్చారు. వాస్తవానికి వీరి స్వస్థలం ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం. వారంలో రెండు, మూడు రోజులు శిక్షణ కోసం ఏలూరు తీసుకెళ్లేవారు. సాధనలో చిన్న చిన్న దెబ్బలు తగులుతుండేవి. దాంతో జెస్సికా భయపడి కొన్నాళ్లు స్కేటింగ్ మానేసింది. తరువాత వీరి కుటుంబం మంగళగిరికి మకాం మార్చారు. అక్కడ బోర్ కొట్టి జెస్సికాకు మళ్లీ స్కేటింగ్ నేర్చుకోవాలని అనిపించడంతో ఆమె తండ్రి విజయవాడ దండమూడి రాజగోపాలరావు స్టేడియానికి తీసుకెళ్లారు. అక్కడ కోచ్ సింహాద్రి వద్ద శిక్షణకు చేర్చారు.

తొలి పోటీలోనే పతకం..

రింగ్‌లో వేగంగా కదలాలంటే రన్నింగ్ అవసరమని కోచ్ చెప్పడంతో రన్నింగ్‌లో కూడా శిక్షణ ప్రారంభించింది జెస్సి. వారంలో మూడు రోజులు పరుగు, మూడు రోజులు స్కేటింగ్ సాధన చేస్తూ ఉండేది. సాధనలో దెబ్బలు తగులుతుండేవి. వాటికి భయపడితే ఆటలో ముందుకు వెళ్లలేవని నాన్న చెప్పేవారని, ఆ మాటలు తనలో పట్టుదలను పెంచాయని జెస్సి చెబుతోంది. ప్రొఫెషనల్ స్కేటర్ అవ్వాలని అనుకుని దాని కోసం పదేళ్ల వయసులో ఆర్టిస్టిక్ సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో అభ్యాసం ప్రారంభించింది. 2020లో విజయవాడలో జరిగిన కృష్ణా జిల్లా అండర్-11 విభాగంలో పాల్గొంది. తొలి పోటీలోనే సత్తా చాటి రజత పతకం గెలుచుకుంది. మరుసటి ఏడాది జిల్లా స్థాయిలో రజతం, అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి ఈవెంట్‌లో రజతం, కాంస్యం సాధించి ఔరా అనిపించింది. దాంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఇక వెనుతిరిగి చూసుకోలేదు.


స్కేటింగ్ చేస్తున్న జెస్సికా

అంతర్జాతీయ స్థాయిలో..

ఎంతో ఉత్సాహంతో మొహాలిలో జరిగిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంది. అయితే అనుకున్నంతగా రాణించలేకపోయినా రెండు కాంస్య పతకాలు గెలుచుకుని గర్వంగా నిలబడింది. మెరుగైన ఫలితాలు రావాలంటే మరింత కష్టపడాలని ఏకాగ్రతతో సాధన చేసి 2022లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణపతకం నెగ్గింది. అది తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందంటారు జెస్సి. కాని అసలైన పరీక్ష తనకు న్యూజిలాండ్‌లో ఎదురైందని, గతేడాది జూన్‌లో అక్కడ నిర్వహించిన పసిఫిక్ ఓషియానా ఛాంపియన్‌షిప్ అండర్-11 విభాగంలో పోటీపపడింది. దీని కోసం భారత్ నుంచి 18 మంది ట్రయిల్ ఎంపిక చేశారు. వారందరినీ దాటి జెస్సికా ఛాంపియన్‌కు అర్హత సాధించింది. అక్కడా సూపర్ పవర్ చూపించి స్వర్ణపతకం గెలుచుకుంది. అదే ఏడాది జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్ రజతం నెగ్గింది. గడిచిన నాలుగున్నరేళ్లలో పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో పతకాలు సాధిస్తూ వస్తోంది.

బాల పురస్కార్...

2004 తన కెరీర్‌లోనే మరిచిపోలేని సంవత్సరం. న్యూజిలాండ్‌లో విజయం తరువాత ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైంది జెస్సి ఒక్కరే. గతేడాది డిసెంబర్‌లో ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డును అందుకున్నానని, అది తనకు ఎనలేని ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చిందని జెస్సికా చెబుతున్నారు. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన తైవాన్ ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటారు. రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచారు. అంతేకాకుండా జులై 24 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించి తనకెవరూ సాటి రారని నిరూపించారు. స్కేటింగ్‌లో మరిన్ని అద్భుత విజయాలు అందుకోవాలని జెస్సికా తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

నా లక్ష్యం.... ఒలింపిక్స్

జెస్సికా

స్కేటింగ్‌తో పాటు రన్నింగ్‌లో కూడా ఛాంపియన్‌గా ఎదగాలని నా కోరిక. రెండిటినీ నెరవేర్చాలనే దృఢ సంకల్పం ఉంది.


జెస్సికా

ప్రస్తుతం విజయవాడ ఎన్ఎస్ఎం స్కూల్లో పదో తరగతి చదువుతున్నాను. చదువులో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించి.. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాల నుకుంటున్నాను. అన్నిటి కంటే పెద్ద లక్ష్యం.. ఒలింపిక్స్ భారత్ ప్రాతినిధ్యం వహించి, పతకం సాధించడం. దాని కోసం మెరుగైన శిక్షణ, కఠోర సాధన చేస్తున్నాను. ప్రథమ ప్రాధాన్యం స్కేటింగ్. అలాగని రన్నింగ్‌ను వదిలేయలేదు. జిల్లా, రాష్ట్రస్థాయి 100, 200, 400 మీటర్ల పరుగు పందేల్లో పాల్గొంటున్నాను. వాటిలో ఇప్పటికి 20 పతకాలు సాధించాను. స్కేటింగ్‌లో 56 పతకాలు గెలిచాను. అందులో 23 స్వర్ణాలు, 22 రజతాలు ఉన్నాయి. నాతోపాటు మా తమ్ముడు జోయల్ ఆదర్శ్ కూడా స్కేటింగ్ శిక్షణ తీసుకుంటున్నాడు. వాడికి టెక్నిక్స్ నేర్పుతున్నాను.

పత్రికా రచనలో వీరేశలింగం కొత్త ఒరవడి

పత్రికారచనలోనూ వీరేశలింగానికి కొత్త ఒరవడే! వివేకవర్ధని పత్రిక ద్వారా అవినీతిపరులపై యుద్ధం సాగించి వారిని హడలెత్తించాడు. సంఘంలోని ఇతర దురాచారాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి పత్రికను ఆయుధంగా వాడుకున్నాడు. 1881 డిసెంబరు 11న తమ ఇంట్లో మొట్టమొదటి వితంతు వివాహం చేశాడు. ఈ పెళ్ళి పెద్ద ఆందోళనకు దారి తీసింది. పెళ్ళికి వెళ్ళినవాళ్ళందరినీ సమాజం నుంచి వెలి వేశారు. అయినా, పట్టువదలని వీరేశలింగం తరువాతి కాలంలో సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. మూఢ విశ్వాసాలు, సనాతనాచారాలపై ఆయన జరిపిన పోరాటం చిరస్మరణీయం, ఇప్పటికీ అనుసరణీయం. ఆయన కాలక్షేపం కోసం చేసిన రచన ఒక్కటీ లేదు. అన్నీ సంఘ సంస్కరణ, ఉద్ధరణ కోసమే!



తెలుగు నాట మూఢాచారాలు, కులమత భావబేధాలూ, కుతర్క కుహనా విలువలూ రాజ్యమేలుతున్న నాటి తరుణంలో–ప్రచండ భాస్కరుడిలా ప్రభవించాడు వీరేశలింగం. పుట్టటమే సంఘసంస్కరణ కోసం పుట్టాడా అన్నట్టు జీవితమంతా ఆ దిశగా అవిరళమైన, అసామాన్యమైన కృషి చేశాడు. ఎవరు నిరసించినా, ఎందరు అవహేళన చేసినా పట్టించుకోలేదు. తాను చేస్తున్నది సమాజానికి మేలు చేసేదని బలంగా నమ్మాడు. అదిలింపులకు, బెదిరింపులు తలవొంచలేదు. అసలు సిసలు కార్యవాదిగా ముందుకు దూసుకుపోయాడు. దెయ్యాలు లేవని నిరూపించటం కోసం బాల్యంలోనే శ్మశానాన్ని సందర్శించిన గుండెధైర్యం తనది. పుస్తకం కొనేంత డబ్బు చేతిలో లేనప్పుడు– పూర్తి సొమ్ము సమకూరేదాకా దుకాణంలోనే కూచొని వసు చరిత్రను చదివిన జిజ్ఞాస తనది. జీవితాంతం అదే ఒరవడి.

వీరేశలింగం 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగాడు. ఐదో ఏట బడిలో చేరి, బాల రామాయణం, ఆంధ్ర నామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం వంటివి నేర్చుకున్నాడు. పన్నెండో ఏట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నప్పటినుంచి అన్ని తరగతుల్లో ప్రథమ శ్రేణిలోనే ఉండేవాడు. తన పదమూడో ఏట ఎనిమిదేళ్ల రాజ్యలక్ష్మమ్మతో బాల్యవివాహం జరిగింది. పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేశాడు. చదువుకునే రోజుల్లో కేశవ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు వంటి వాటి వల్ల ప్రయోజనం లేదని, దయ్యాలు, భూతాలు వంటివి లేనేలేవని చిన్నప్పుడే బలంగా నమ్మేవాడు.

1867లో పెదనాన్న మరణంతో ప్రభుత్వోద్యోగంలో చేరాలని ప్రయత్నించాడు. కానీ లంచం ఇవ్వనిదే ఉద్యోగం రాదని తెలిసి, ఆ ప్రయత్నం విరమించాడు. కొన్నాళ్లు న్యాయవాద వృత్తి ఆసక్తి చూపినా, అందులోనూ అవినీతి, అబద్ధాలూ ప్రబలంగా ఉన్నాయని భావించి, అదీ మానుకున్నాడు. ఆఖరికి బోధనా వృత్తిని స్వీకరించాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చేయడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని పత్రికను ప్రారంభించాడు. 'సంఘంలోని అవకతవకలను ఎత్తిచూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం' లక్ష్యాలుగా పత్రిక నడిపాడు. ఎంతోమంది అవినీతిపరుల బాగోతాలను సోదాహరణంగా బయటపెట్టి, ఇన్వెస్టిగేషన్ జర్నలిజానికి కూడా ఆయనే తొలి అడుగు వేశాడు. తరువాత హాస్య సంజీవిని అనే హాస్య పత్రికను ప్రారంభించాడు. తెలుగులో మొట్టమొదటి ప్రహసనాన్ని ఈ పత్రికలోనే ప్రచురించాడు. కందుకూరి ఇటు సంఘ సంస్కరణకు, అటు సాహిత్య సృజనకూ సమ ప్రాధాన్యం ఇచ్చి, ఎంతో సేవ చేశారు. అనేకనేక రంగాల్లో ఆయన ప్రజ్ఞాశాలి, కార్యవాది. అందుకనే తెలుగు జాతి నవయుగ వైతాళికుడిగా పేరొందాడు. చెప్పటం కన్నా చేయటమే పనిగా పెట్టుకున్న మహా మనీషి ఆయన. స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కోసం పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు. అన్ని కులాల పిల్లలూ ఒకేచోట కూర్చొని విద్యాభ్యాసం చేసే మార్పుకు శ్రీకారం చుట్టాడు. అంటరాని కులాలుగా సమాజం దూరం పెట్టిన వారికి చదువు చెప్పడంతో పాటు పలకాబలపం, పుస్తకాలూ సమకూర్చారు. అప్పటి సమాజంలో బాలికలకు చిన్నప్పుడే పెళ్ళిళ్ళు చేస్తే– వారు కాపురాలకు పోకముందే భర్తలు మరణిస్తే– వితంతువులై అనేక కష్టనష్టాలు ఎదుర్కొనేవారు. వారికి మరొక వివాహం నిషిద్ధం. అది దురాచారమని చెప్పటమే కాదు; ఎన్నో సాహసాలకు తెగించి, విమర్శలకు తలొగ్గి వితంతు పునర్వివాహాలకు పూనుకున్నాడు వీరేశలింగం. తొలుత ఆయన వెంట నడిచిన మిత్రులు అనేకమంది తరువాత తప్పుకున్నారు. అప్పటి కుల కట్టుబాట్లకు జడిచి, వెనక్కు మళ్లారు. అయినా, వీరేశలింగం వెనుదిరిగి చూడలేదు. కుల బహిష్కరణను ఎదుర్కొన్నాడు. సామాజిక వెలిని బేఖాతరు చేశాడు. వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసే దుష్ప్రచారం ఎంత చేసినా చలించలేదు. ఒకానొక దశలో వితంతు పునర్వివాహాలు చేస్తున్నప్పుడు– ఊళ్లో అందరూ సహాయ నిరాకరణ చేసినా– పనులన్నీ ఆయనా, ఆయన జీవసహచరి రాజ్యలక్ష్మమ్మ చక్కబెట్టారు. గోదావరి నది నుంచి నీళ్ల మోసి వీరేశలింగం సదాశయాన్ని నెరవేర్చటంలో రాజ్యలక్ష్మమ్మ అడుగడుగునా తోడుగా నిలిచారు. ఆంధ్రదేశంలో ఆయనే ..10లో

చిన్నసాయం... గొప్పమనసు



పేదలకు సాయం చేస్తున్న చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా అపురూప సేవలు

స్ఫూర్తి నింపిన ఉపాధ్యాయ మిత్రులు



చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - దెందులూరు

సొంతలాభం కొంత మానుకుని సాటి వారికి మేలు చేయవోయ్ అన్నాడో మహాశయుడు. దానిని అక్షరాల నిజం చేస్తున్నారు ఆ స్నేహితులు. సమాజాన్ని మంచి వైపు నడిపించే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఒదిగి పోతూనే మరో పార్శ్వంలో అందరికీ ఆదర్శప్రాయులుగా పదుగురికి సాయం చేస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులు రగిల్చిన స్ఫూర్తి నేడు 50 మందికి మరింత మందిని సేవ దిశగా అడుగులు వేసేలా చేస్తోంది.

పండుటాకులకు ఆసరా..

పెదవేగి మండలం పెదవేగి, గోపన్నపాలెం చుట్టుపక్క గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పరసా నాగార్జున, లక్ష్మీనారాయణ, శివరామకృష్ణ, లక్ష్మణ్, రంగారావులు స్నేహితులు. వీరంతా ఒక రోజు పిల్లల నిరాదరణకు గురై ఆకలితో అలమటిస్తున్న ఒక వృద్ధుడిని చూసి చలించిపోయారు. తమ జీతాల్లోంచి కొంత పోగేసి ఆ వృద్ధుడికి అవసరమైన నిత్యావసరాలు కొనిచ్చారు. అప్పుడు ఆ వృద్ధుడి కళ్లల్లో ఆనందం చూసి చాలా సంతోషం అనిపించింది. ఇక నుంచి కటిక పేదరికం, పిల్లల నిరాదరణకు గురవుతున్న వృద్ధులను గుర్తించి వారికి ప్రతి నెలా కొంత నగదు, నిత్యావసరాలు అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని అమెరికాలో ఉంటున్న తమ స్నేహితుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చందుతో చర్చించగా ఆయన కూడా ఒకే అన్నాడు. ఇక అనుకున్నదే తడవుగా చేయూత స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. వీరంతా కలిలసి పిల్లలు చూడని తల్లిదండ్రులను ఆదుకోవడం ప్రధాన లక్ష్యంగా ఆదాయంలేని పేదలు, వ్యాధులతో బాధపడే వారు, ఒంటరి మహిళలు, పేద విద్యార్థులను గుర్తించి సాయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 114 నెలలుగా వివిధ సమస్యలతో బాధపడేవారికి సాయం అందించారు. వీరి సేవల్లో నిజాయితీని గుర్తించిన సమీప గ్రామాలకు చెందిన ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు స్ఫూర్తి పొంది చేయూతలో సభ్యులుగా చేరారు. ఐదుగురితో ప్రారంభమైన సభ్యుల సంఖ్య నేడు 50కి చేరింది. ఇంకా చేరుతూనే ఉన్నారు.



పేదలకు సాయం అందిస్తూ..

రూ.50 వేల వరకు సాయం..

చేయూతకు సభ్యులుగా ఉన్న 50 మంది తమ తమ ప్రాంతాల్లో వాస్తవికంగా కష్టాల్లో ఉన్న వృద్ధులు, చిన్నారులు, అనాథలను గుర్తిస్తారు. అలా వచ్చిన వాటిపై కమిటీలో చర్చించి ఎంపిక చేసిన వారిని చేయూత వాట్సాప్ గ్రూపులో ఉంచుతారు. సాయాన్ని నెల మొదటి వారంలో వారికి అందిస్తారు. కొందరు సాయం అందుకున్న మూడు రోజుల్లో మరణించారని, అది తమనెంతో బాధించిందని చేయూత వ్యవస్థాపకుల్లో ఒకరు నాగార్జున తెలిపారు.

విద్యార్థుల అవసరాలు తీరుస్తూ..

చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు చేతనంత సాయం చేస్తున్నారు. పరీక్షల వేళ పలు పాఠశాలల విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు ఇస్తున్నారు. పాఠశాలల ప్రారంభ వేళ పుస్తకాలు, బ్యాగులు అందిస్తూ వస్తున్నారు. ఒక వేళ మరీ పేద విద్యార్థులు అయితే వారికి పరీక్షల ఫీజు, పాఠశాల ఫీజులు అందిస్తున్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులకు అవసరాలు తీరుస్తున్నారు. ఇలా వేలాదిమందికి చేయూత ద్వారా సాయం అందించారు. అనేక మంది వికలాంగులకు వీల్‌చైర్లు అందించి మానవత్వం చాటుకున్నారు.



వికలాంగులకు వీల్‌చైర్లు అందిస్తూ...

సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంది

పరసా నాగార్జున, ఉపాధ్యాయులు, చేయూత వ్యవస్థాపకులు

ఎదుటివారికి సాయం చేయడంలో ఉండే తృప్తి వేరు. పాపం తల్లిదండ్రులకు వయసు వచ్చాక పిల్లలు మొహం చాటేస్తున్నారు. దీంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే మేము అలాంటి వారినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాం. చాలా మంది వికలాంగులకు వీల్ చైర్లు అందించాం.



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తూ..

ఆధ్యాత్మికత అంటే మత విద్వేష రాజకీయం కాదని చాటిన సర్వేపల్లి

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సెప్టెంబర్ 5. దేశమంతటా ఉపాధ్యాయుల దినోత్సవంగా ఈ రోజును పాటిస్తారు. "మా అధ్యాపక రంగం నుంచే ఆయన దేశానికి రాష్ట్రపతి అయ్యారు తెలుసా!" అంటూ గొప్పలు పోతారు. ముఖ్యంగా అధికారులు, రాజకీయ నాయకులు ఉపాధ్యాయ వృత్తి పవిత్రత గురించి ప్రసంగాలు చేస్తారు. కాని డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ భావాల గురించి, బోధనల గురించి ఎక్కువగా ఎవరూ ప్రస్తావించరు. కాని గతంలో ఎప్పటికన్నా కూడా ఇప్పుడు సర్వేపల్లి భావాల, బోధనల ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా నేటి విద్యా వ్యవస్థలో మోడీ ప్రభుత్వం జొప్పిస్తున్న శాస్త్ర వ్యతిరేకమైన భావనల నేపథ్యంలో, అవాస్తవాల చరిత్రతో భవిష్యత్తు తరాల మెదళ్ళను పాడుచేస్తున్న వాతావరణంలో ఉపాధ్యాయులు ఎటువంటి దృక్పథంతో, ఎటువంటి విలువలతో వ్యవహరించాలన్నది సర్వేపల్లి దార్శనికత నుంచి తెలుసుకోవచ్చు.

డా॥రాధాకృష్ణన్ 1888–1975 మధ్య కాలంలో జీవించారు. 1954లోనే ఆయనకు భారతరత్న బిరుదు ప్రదానం అయింది. ఆ తర్వాత 1962లో భారతదేశపు రెండవ రాష్ట్రపతిగా వ్యవహరించారు. అంతకు ముందు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన 33వ ఏటనే భారతీయ తత్వశాస్త్రం అన్న గ్రంథాన్ని రచించారు. అప్పటివరకూ బ్రిటిష్ పాలకులు తమ విద్యా విధానం ద్వారా ఎక్కించిన ఆత్మన్యూనత నుండి భారతీయులు బైట పడడానికి కావలసిన తాత్విక భూమికను ఈ గ్రంథం ఏర్పరిచింది. డా॥రాధాకృష్ణన్ వ్యక్తిగతంగా ఆధ్యాత్మికవాది. ప్రముఖ జర్మన్ తత్వవేత్త హెగెల్ ప్రతిపాదించిన 'అఖండ భావం' అన్న దానికి, మన ప్రాచీన ఉపనిషత్తులలో సూచించిన పరమాత్మ భావానికి చాలా సామ్యం ఉందని రాధాకృష్ణన్ భావించారు. ఆయన ఆధ్యాత్మికవాది అయినా, ప్రాచీన భారతదేశంలోని తాత్విక సాంప్రదాయాలను తన గ్రంథంలో వివరించేటప్పుడు ఆ యా తత్వవేత్తల భావనలను యథాతథంగా వివరించారు. బౌద్ధం, జైనం, సాంఖ్యం, లోకాయతం వంటి భౌతికవాద దర్శనాలను కూడా అదేవిధంగా వివరించారు. అందుకే ఆ గ్రంథం విదేశీ, స్వదేశీ విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర విద్యార్థులకు ఒక రిఫరెన్స్ గ్రంథంగా కొనసాగుతోంది.

ఈ మధ్య మన రాష్ట్రంలో, దేశంలో కూడా సనాతన ధర్మం గురించి చర్చ జరుగుతోంది. ఈ చర్చను హిందూ మతస్తులకు, తక్కినవారికి మధ్య చర్చ లాగా, లేక భక్తులకు, నాస్తికులకు మధ్య చర్చ లాగా దిగజార్చేందుకు కొందరు శక్తివంచన లేకుండా తాపత్రయ పడుతున్నారు. వాస్తవంగా ప్రగతికి, అభివృద్ధి నిరోధకత్వానికి మధ్య చర్చ జరగాలి. ఈ పరిస్థితుల్లో ఒక ఆధ్యాత్మికవాది అయిన డా॥ రాధాకృష్ణన్ సనాతనవాదుల గురించి ఏం రాశారో తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఆ ప్రాతిపదికన తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకుని నెరవేర్చడం అవసరం.

తాత్విక చింతన మానవ ప్రగతికి తోడ్పడేదిగా ఉండాలి

"తాము సాంప్రదాయ రక్షకులం అనుకునే సనాతన వాదులు 'సత్యం అనేది కాలం బట్టి మారిపోదు' అనే వాదనను ముందుకు తెస్తారు. ఒక సాయంసంధ్యలో ఉండే సౌందర్యం మాదిరిగా, బిడ్డ పట్ల తల్లి ప్రేమ మాదిరిగా అది కాలాతీతమైనదని వారు అంటారు.



సత్యం కాలంతోబాటు మారకపోవచ్చు. కాని ఏ యే రూపాల్లో ఆ సత్యం వ్యక్తం ఔతూవుంటుందో ఆ రూపాలు నిరంతరం మారుతూనే వుంటాయి. మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ

> **మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి.**

మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి. మన ప్రాచీన గ్రంథాలలో, ధర్మాలలో పేర్కొన్న విషయాలను యథాతథంగా పదే పదే తిరిగి ఉచ్చరిస్తూ ఆ క్రమంలో వాటి వెనుక ఉన్న స్ఫూర్తిని వదిలేయకూడదు.

రెండు వేల సంవత్సరాల క్రితం జీవించిన మన హిందూ పెద్దలు విజ్ఞానం తక్కువ స్థాయిలో కలిగి వున్నా, చాలా కాంతివంతమైన దార్శనికతను కలిగివుండేవారు. వాళ్ళే గనుక, ఇన్ని శతాబ్దాల తర్వాత మళ్ళీ మన గడ్డ మీదకి వస్తే ఆనాడు తాము ప్రవచించిన బోధనలను నిజంగా అప్పటి స్ఫూర్తితో ఆచరిస్తున్న అనుచరులు ఒక్కరు కూడా వారికి కనపడరు.

మన చైతన్య ప్రవాహం స్వేచ్ఛగా ముందుకు సాగడానికి వీలు లేకుండా అనేక నిర్జీవ భావాలు మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి స్థితిలో జీవం లేని భావరూపాలను, వాటిలో ఏ కీలక సత్యమూ లేకపోయినప్పటికీ అతి పవిత్రమైనవిగాను, ఆరాధ్యదాయకమైనవి గాను పరిగణిస్తూ వాటిని ఏమాత్రమూ సవరించడానికి వీలు లేదని పట్టుబట్టడం అంటే భావాల స్వేచ్ఛా ప్రవాహాన్ని మరింత ఆటంకపరచడమే. గత కాలపు చెత్తతో విషమయమైన రోగిని (ఆ చెత్తనంతటినీ తొలగించే బదులు యథాతథంగా దానిని కాపాడితే) మరింత ఎక్కువ బాధలకు గురి చేయడమే ఔతుంది. మార్పు అవసరం అన్న సంగతి సనాతనవాదులు గ్రహించాలి. ఈ గ్రహింపు తగినంతగా వారిలో కనిపించడం లేదు. అందువలన మన తాత్విక రంగంలో ఒక పక్క లోతుల్లోకి పోయి అన్వేషించి జ్ఞానాన్ని తెలుసుకోవాలనే పట్టుదల వ్యక్తం ఔతూంటే, మరోపక్క తాత్విక రంగానికి సంబంధం లేని గందరగోళం వ్యక్తం ఔతోంది. మన ప్రాచీన విజ్ఞాన శాస్త్ర మూలాలను, ప్రాచీన విశ్వాసాల మూలాలను గ్రహించడానికి వీలు లేకుండా గందరగోళపరిచే విధంగా మధ్యలో పేరుకున్న చెత్తను తొలగించడం, శాస్త్ర విజ్ఞానపు స్ఫూర్తితో మతాన్ని సమన్వయ పరచడం నేటి భారతీయ మేథావుల ప్రధాన కర్తవ్యం.

> **దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి.**

కాని దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి. భావాలు శక్తివంతమైనవి. వాటిని వ్యాపించనివ్వాలి. వర్తమానం తన మృత్యువును తానే చూడకుండా ఉండాలంటే ఇది చాలా అవసరం. ఉపనిషత్తులు, గీత, బుద్ధుని బోధనలు మానవ మేధస్సును అనేక అంశాలలో సున్నితంగా స్పృశించగలిగాయి. అవి ఇప్పుడు అదే విధమైన ప్రభావాన్ని సనాతన వాదం కారణంగా చూపించలేక పోతున్నాయి. ఈ ఎండిపోయిన చెట్లకు ఇప్పుడు పూలు పూయమంటే ఏ విధంగా పూస్తాయి? ఏ విధంగా వాటినుండి ఫలాలు లభిస్తాయి?

> **ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి.**

ఒకవైపు విమానాలు, పొగ ఓడలు, రైలుబళ్ళు, టెలిగ్రాఫ్‌లు ప్రపంచంలోని మనుషులందరినీ ఒక్కటిగా చేస్తున్న కాలంలో మనం ఆ ప్రపంచంతో సంబంధం లేకుండా విడిగా మనగలమా? అందుచేత మన భావచైతన్యం ప్రపంచం సాధిస్తున్న ప్రగతికి ప్రతిస్పందించాలి. మనవంతుగా దానిని ముందుకు నడిపించాలి. నీటి ప్రవాహం లేని చెరువులు, కుంటలు నాచు, చెత్త పేరుకుపోయి పనికిరాని, హానికరమైన జీవులకు నిలయాలౌతాయి. అదే ప్రవహించే నదిని చూడండి! అనునిత్యం ముందుకు సాగుతూ కొత్త ఊటల నుండి ప్రేరణ పొందుతూ కొత్త శక్తిని పొందుతూనే వుంటుంది. ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి. ఒక జాతీయ స్థాయిలో ఈ ప్రక్రియ ఏవిధంగా జరగాలో మనకు గాంధీ, టాగూర్, అరబింద ఘోష్, భగవాన్ దాస్ వంటి నేతల రచనలు సూచిస్తున్నాయి. మన ప్రాచీన విజ్ఞానంలోని గొప్పదనాన్ని గ్రహిస్తూ, దాని నుండి ప్రేరణ పొందుతూనే పాశ్చాత్య భావనల పట్ల కూడా అమిత శ్రద్ధ ప్రదర్శిస్తూ వాటిని అధ్యయనం చేసి ఇముడ్చుకోవాలి. వర్తమాన జీవితాన్ని ఉన్నది ఉన్నట్లు చూసి అందులో జీవించే బదులు, గతంలోనే జీవించాలని కోరుకునే సనాతనవాదులకు భవిష్యత్తు ఎక్కడిది?

ఒక మూఢాచారంగా దిగజారిపోతూ, తన పరిధిని కుదించుకుంటూ వర్తమాన పరిస్థితులకు ఏ మాత్రమూ ఉపయోగపడనిదిగా మన తాత్విక చింతన ఉండాలా లేక సజీవంగా, వాస్తవికంగా, మానవ ప్రగతికి దోహదపడే అంతర్భాగంగా ఉండాలా? అన్నది మనముందున్న సవాలు. ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ఆధునిక విజ్ఞానాన్ని ప్రాచీన తత్వవేత్తల సమున్నత ఆదర్శాలను రెండింటినీ మేళవించడం మన కర్తవ్యం. వర్తమాన సమాజాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దగలిగినప్పుడే, పురోగతికి తోడ్పడినప్పుడే భారతీయ తాత్వికతకు సార్థకత చేకూరుతుంది. యాజ్ఞవల్క్యుడు, గార్గి, బుద్ధుడు, మహావీరుడు, గౌతముడు, కపిలుడు, శంకరుడు, రామానుజుడు, మాధవుడు, వల్లభుడు, ఇంకా మరెందరో మహా రుషులు, మేథావులు చేసిన కృషి ఈ కర్తవ్యాన్ని మనం సాధించగలం అన్న ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది." (ఇండియన్ ఫిలాసఫీ–వాల్యూం 2 ఆక్స్‌ఫర్డ్ ఇండియా ప్రచురణ 2008, పేజీలు 724 నుండి 727 వరకు)

తన గ్రంథం ముగింపులో డా॥రాధాకృష్ణన్ నిర్దేశించిన కర్తవ్యం ఇది. ఇదే మన ఉపాధ్యాయ, అధ్యాపక లోకానికి ముందున్న తక్షణ కర్తవ్యం.

– ఎం.వి.ఎస్. శర్మ, మాజీ ఎంఎల్‌సి

ఎప్పుడైతే జీవితంలో భయం పోతుందో
అప్పుడే జీవితం ప్రారంభమవుతుంది.
- చేగువేరా

సర్వోదయ స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దరూ..

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామ స్వరాజ్యం, భూదానోద్యమంపై విస్తృతంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు, సదస్సులు జరుగుతున్న రోజులు అవి. గాలి, నీటి మీద అందరికీ సమాన హక్కులు ఉన్నట్టే భూమి మీద కూడా అందరికీ హక్కు ఉంటుందని ప్రజాశక్తి ద్వారానే సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆచార్య వినోభావే దేశవ్యాప్తంగా 1951 ముందు నుంచే ఉద్యమం చేపట్టారు. ధనవంతులు చేతుల్లో ఉన్న వందలాది ఎకరాల మిగులు భూమిని విరాళంగా తీసుకుని ఆ గ్రామంలో పేదలందరూ సమానంగా పంచుకుని వ్యవసాయం చేసుకుని గ్రామ స్వరాజ్యం సాధించాలనేది సర్వోదయ ఉద్యమ పితామహుడు వినాభాజీ ఉద్యమ లక్ష్యం. దీనికోసం ప్రతియేటా సర్వోదయ సమ్మేళనాలు నిర్వహించి భూస్వాముల నుంచి భూములను స్వీకరించే వారు. ఈ క్రమంలో 13వ సర్వోదయ సమ్మేళనం అప్పటి పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంటలో నిర్వహించారు. అదొక పల్లెటూరు. ఒకపక్క రైలు మార్గం. ఇంకోపక్క జాతీయ రహదారి. వీటి మధ్యలో విశాలమైన పొలాల్లో రెండు కిలోమీటర్ల మేర తాటాకు పందిర్లు వేసి 1961 ఏప్రిల్ 18, 19, 20వ తేదీల్లో మూడు రోజులపాటు జాతీయ సర్వోదయ సమ్మేళన సదస్సులు జరిగాయి. సర్వోదయ నాయకుడు, మాజీ మంత్రి చింతలపాటి మూర్తిరాజు ఆధ్వర్యంలో ఈ సదస్సులు ఇక్కడ జరిగాయి. దీనికోసం ఆ రోజుల్లో రైతులు, సర్వోదయ భావాలు ఉన్నవారు, గాంధేయవాదులు ఉదారంగా సమ్మేళనానికి వచ్చే వారికోసం చలువ పందిర్లు, ఉచిత భోజన ఏర్పాట్లకు సహకరించారు. దేశంలో నలుమూలల నుంచి సర్వోదయ, గాంధేయవాద నాయకులు రావటానికి అనువుగా నాచుగుంటలో రైల్వేస్టేషన్‌ను తాత్కాలికంగా ప్రారంభించడం చారిత్రాత్మక విషయం. అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్, ముఖ్యమంత్రి డి.సంజీవయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, బొడ్డేపల్లి అప్పారావు, సినీనటులు రామకృష్ణ, జయప్రకాష్ నారాయణ, విజయనగరం సంస్థానాధీశుడు, అప్పటి ఎంపీ విడివికె.రాజు, సర్వేపల్లి రాధాకృష్ణ తదితర అతిరథ మహారథులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన సర్వోదయ సమ్మేళనానికి సూచికగా నాచుగుంట వద్ద పొలాల్లో నిర్మించిన సర్వోదయ స్తూపం చారిత్రాత్మక ప్రాంతంగా నేటికి కొనసాగుతోంది. జిల్లాలో నాచుగుంట వద్ద సర్వోదయ స్తూపాన్ని, పెదనింద్రకొలనులో గాంధీ భవనాన్ని చారిత్రాత్మక చిహ్నాలుగా గుర్తించి వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు కోరుతున్నారు. 1961లో ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద జాతీయ రహదారి, రైలు మార్గం మధ్యలో 13వ అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించిన క్రమంలో ప్రతియేటా ఏప్రిల్ 18న ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ స్తూపం వద్ద శాంతి ప్రతిజ్ఞ, స్వాతంత్ర్య సమరయోధులు, సమాజ సేవలకు సన్మానం చేయటం పరిపాటిగా వస్తోంది.


సర్వోదయ సమ్మేళనంలో మాట్లాడుతున్న దామోదర సంజీవయ్య



పత్రికా రచనలో వీరేశలింగం కొత్త ఒరవడి

(ఆరో పేజీ నుంచి)

బ్రహ్మ సమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజసేవ కోసం 1905లో హితకారిణి సమాజం నెలకొల్పి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశాడు. తెలుగు పండితుడిగా 25 ఏళ్ల పాటు పాటు రాజమండ్రిలో, ఐదేళ్ల పాటు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో పనిచేశాడు. 130కి పైగా గ్రంథాలు రాశాడు. అనేక సాహిత్య ప్రక్రియలకు ఆయనే ఆద్యుడు. తొలి తెలుగు నవల రాజశేఖర చరిత్రను రాశాడు. అప్పటివరకూ కథల్లో దేవుడో, రాజాధిరాజులో కథానాయకులైతే - రాజశేఖర చరిత్రలో సామాన్యుడే కథానాయకుడు. ప్రహసనాలు పేరిట సమాజంలో మూఢాచారాలను, దురాచారాల ను దుయ్యబట్టారు. తన రచనలతో ఛాందసవాదుల వాదనలను పూర్వపక్షం చేస్తూ, ఆధునిక ఆలోచనాపరుల్లో చైతన్యం నింపారు. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. పిల్లల కోసం వాచకాలు తయారు చేశాడు. ఆయన వెలువరించిన ఆంధ్ర కవుల చరిత్ర ప్రత్యేక ఖ్యాతి గడించింది. ఆయన ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉన్నా- ఎక్కడా ఏ విషయంలోనూ జాప్యం చేసి ఎరగడు. పగటివేళ సంఘ సంస్కరణ, రాత్రుళ్లు గ్రంథరచన చేసేవాడు.

సమాజం మార్పు కోరే ప్రతి ఒక్కరికీ వీరేశలింగం జీవితం ఒక పాఠ్యపుస్తకం. ఉన్న సమాజాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నప్పుడు యథాతథవాదులు, స్వార్థపరులూ అనేక రూపాల్లో ఆటంకాలు కల్పిస్తారు. అపప్రథలకు గురి చేస్తారు. అయినా, లక్ష్యపెట్టకముందుకు వెళ్లటమే- కార్యశీలుర లక్షణం. అదే వీరేశలింగం జీవిత సందేశం.

- సాహితి

పామాయిల్ కార్మికుల గోడు పట్టని ప్రభుత్వాలు

పిట్టల్లా రాలిపోతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం



జిల్లాలో సుమారు పదివేల మందికిపైగా పామాయిల్ తోటల్లో పనిచేస్తున్న కార్మికులు ఉన్నారు. వారితో పాటు మరో రెండు వేల నుంచి ఐదు వేల మంది వరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులు ఉన్నారు. మొత్తం 15 వేల మంది పామాయిల్ కార్మికులు ఉన్నారు. వీరు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పామాయిల్ పంట పండించే రైతు లాభాల బాట పట్టడం ఒక భాగం. రైతుకు వెన్నుముకల ఉంటూ పామాయిల్ తోటల్లోనే నిత్యం జీవించే కార్మికులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వారి గోడు ప్రభుత్వానికి పట్టడం లేదు. చనిపోయిన కార్మికుల కుటుంబాల గురించి ఆలోచించే నాధుడే లేకుండాపోయాడు. చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదు. హక్కులన్నీ కోల్పోతున్న పామాయిల్ కార్మికుల వెతలను ప్రభుత్వం పట్టించుకోవాలని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పామాయిల్ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుంది.

పామాయిల్ పంట నేపథ్యం.. జిల్లాలో ఉన్న అనుబంధం

మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో 1988లో పామాయిల్ సాగు ప్రారంభించారు. టిఎంఒపి పథకం కింద 1992లో పెదవేగి ఆయిల్‌ఫెడ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో 1996 నుంచి జిల్లాలో సాగు విస్తీర్ణం ప్రారంభమైంది. ఏలూరు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. రాష్ట్రంలో పామాయిల్ సాగులో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అంతర్జాతీయంగా పామాయిల్‌కు డిమాండ్ ఉండటంతో ఇక్కడి రైతులు పామాయిల్ సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ సాగును విస్తరించడానికి తగిన చర్యలు తీసుకుంటుంది. మెట్ట ప్రాంతంలో ఈ ఆయిల్‌పామ్‌ను ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తీర్ణంలో 50 శాతం కేవలం ఈ ఏలూరు జిల్లాలోనే ఉంది. సంవత్సరానికి రాష్ట్రంలో నాలుగు వేల ఎకరాల చొప్పున పామాయిల్ సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 22 మండలాల్లో 2,16,192 ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. రైతులకు కొన్ని ప్రయివేట్ కంపెనీలు మొక్కలకు రాయితీల కింద హెక్టారుకు రూ.5,250 చొప్పున మొదటి నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చుల పేరుతో రైతుకు జమ చేస్తున్నారు. దీంతోపాటు ఈ పామాయిల్ పండించడం వల్ల అంతర పంటలు వేసుకోవడానికి కూడా వీలుంటుందని రైతాంగం ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా రైతులు అధిక లాభం పొందుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది.

జిల్లాలో కామవరపుకోట, చింతలపూడి, టి.నర్సాపురం, ద్వారకాతిరుమల, పెదవేగి, లింగపాలెం, దెందులూరు, జీలుగుమిల్లి, బుట్టయిగూడెం, ముసునూరు, నూజివీడు మండలాల్లో ఈ పామాయిల్ సాగు అధికంగా ఉంది. జిల్లాలో రూ.2.50 లక్షల ఎకరాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంది. దీనిలో 2.16 లక్షల ఎకరాల్లో సాగు ఉంది. మార్కెట్ ధరతో సంబంధం లేకుండా జిల్లాలో సాగు అధికంగా జరుగుతుంది.

ఈ ఆయిల్‌పామ్ పంట వేసిన ఐదేళ్ల నుంచే దిగుబడి రావడంతో దీన్ని ఎక్కువగా సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ పంట నుంచి ఎకరానికి పది టన్నుల దిగుబడి వస్తుంది. నాటిన ప్రతి మొక్కా 30 ఏళ్ల వరకు దిగుబడిని ఇస్తుంది. పైగా ఈ పంట పండించడానికి ఎక్కువ నీరు కూడా అవసరం లేదు. దీనికి నిర్వహణా ఖర్చులు కూడా చాలా తక్కువ.

జిల్లాలో నవభారత్ ఆగ్రో, మూడు గోద్రేజ్ ఆగ్రో వెట్ కంపెనీలు, ఎపి ఆయిల్‌ఫెడ్, పతంజలి ఫుడ్స్, ఫుడ్స్ అండ్ ప్యాడ్స్ తదితర కంపెనీలు ఉన్నాయి. ఈ ఏడాది ఆయిల్‌పామ్ అంతర్జాతీయంగా టన్నుకు రూ.13,400 ధర ఉంది. ఆయిల్‌పామ్ సాగు పట్ల మొగ్గు చూపుతున్న రైతులు మామిడి, జీడిమామిడి తోటలను తొలగించి ఈ మొక్కలను వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 23 వేల ఎకరాల్లో దీని సాగు పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధర విషయంలో సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదనే అసంతృప్తి కూడా రైతుల్లో ఉంది. ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ఏలూరు ఎంపీ రైతులతో దఫదఫాలుగా చర్చించారు. తోడ్పాటు అందించడంలో ప్రభుత్వాలు కూడా ముందుకు వస్తున్నాయడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఆయిల్‌పామ్ సాగులో పెద్దగా ఇబ్బందులు లేకపోవడం, ఈ తోటలకు కౌలు ఎక్కువగా వస్తుండడంతో భూ యజమానులు ఆయిల్‌పామ్ తోట వేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు 143 మొక్కల వరకూ నాటుతారు. దిగుబడి వచ్చే వరకూ అంతర పంటలుగా మొక్కజొన్న, కూరగాయలు, కోకో వంటివి సాగు చేస్తున్నారు.

పామాయిల్ కార్మికుల సమస్యలు

తక్కువ వేతనాలతో పామాయిల్ కార్మికులు రోజులు తరబడి వందల కిలోమీటర్లు ప్రయాణించి పని చేయాల్సి వస్తోంది. ఇది వారి జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తోంది. కనీస వేతనాల జిఒ నెం. 93 ప్రకారం కూడా వేతనం దక్కడం లేదు. రోజు కూలి ఎంత ఉండాలనేది 1948లో ప్రభుత్వం కనీస వేతనం చట్టం చేసింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని చట్టం చెబుతుంది. ఈ చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వాలకు లేదు. రోజుకు కూలి రూ.400 నుంచి రూ.800 వరకు ఉంటుంది. ఈ కూలి వారి ప్రయాణ ఖర్చులకు కూడా ..12లో

పామాయిల్ కార్మికుల గోడు పట్టని ప్రభుత్వాలు

(11వ పేజీ నుంచి)

సరిపోవడం లేదు. తాము చేస్తున్న పనికి తగిన వేతనం దక్కడం లేదని (కూలీలు) కార్మికులు వాపోతున్నారు. వీరి దినచర్య పామాయిల్ తోటలకే పరిమితమయ్యేలా నేడు కన్పిస్తోంది. భార్యాపిల్లల్ని వదిలి వందల కిలోమీటర్లు మోటర్ సైకిల్, ఆటోల్లో ప్రయాణించి ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు తోటల్లో మగ్గుతున్న వీరికి చట్టప్రకారం ఇవ్వాల్సిన వేతనాలు రావడం లేదంటే అతిశయోక్తి కాదు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వాలు మాట్లాడకపోవడం హాస్యాస్పదంగా ఉంది. ఏలూరు ఎంపీ రైతాంగం గురించి మాట్లాడుతున్న నేపథ్యంలోనే కార్మికుల సమస్యలపై మాట్లాడకపోవడం చాలా బాధాకరం. రైతులను మనుషులుగా గుర్తించే ప్రభుత్వాలు కార్మికులను గుర్తించలేవా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రమాదకర పని పరిస్థితులు

పామాయిల్ తోటల్లో పనిచేసే కార్మికులు అనేక రకాలైన ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి పామాయిల్ చెట్ల మట్టలు, గెలలు కోస్తున్న సందర్భంలో విషపు పాములు, తేళ్ల, జెర్రులు కాటేసి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మట్టలు, గెలలు మీద పడటంతో దీర్ఘకాలం వికలాంగులుగా మారుతున్నారు. ఈ సంవత్సరకాలంలోనే సుమారు 15 మంది పామాయిల్ కార్మికులు వికలాంగులుగా మారిన ఘటనలు ఉన్నాయి. వారికి రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యాన, కార్మిక శాఖ నుంచి ఎలాంటి పరిహారమూ అందడం లేదు. పైగా మంచానికే పరిమితం కావడంతో వారి కుటుంబాలు గడవడం కష్టంగా మారుతుంది. వైద్య ఖర్చులు కూడా తోట యాజమాన్యం ఇవ్వకపోవడంతో కూలీల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందుతుందనడానికి ఇదే నిదర్శనం. మరోపక్క కరెంట్ తీగలు కార్మికుల మెడలకు ఉరి తాడులుగా మారాయి. హైఓల్టేజీతో ఉన్న విద్యుత్ తీగలకు పామాయిల్ గెలలు, మట్టలు కోసే సందర్భంలో విద్యుత్ తీగల మీద పడి కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన కార్మికుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నా ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతున్నాయి. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలనే డిమాండ్ ఏవిధంగా అయితే రైతు కోరుకుంటాడో, రైతు పంట ఫ్యాక్టరీకి వెళ్లాలన్నా పామాయిల్ కార్మికుడి శ్రమ అంత కీలకం. పామాయిల్ కార్మికుని శ్రమను దోచుకుంటూ ఫ్యాక్టరీ యాజమాన్యాలు, తోటల యజమానులు వీళ్లని జంతువుల కన్నా హీనంగా చూస్తున్న ఘటనలు ఈ కాలంలో కన్పిస్తున్నాయి. ఒక పామాయిల్ కార్మికుడు చనిపోతే కూరగాయల కొట్టు దగ్గర బేరమాడినంత ఈజీగా బేరసారాలు సాగించడం సిగ్గుచేటు. టి.నర్సాపురం మండలం జగ్గవరం, బొర్రంపాలెం, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, చింతలపూడి మండలం సీతానగరం, ప్రగడవరం, ఎర్రగుంటపల్లి తదితర గ్రామాల్లో పామాయిల్ కార్మికులు చనిపోయి వారి కుటుంబాలు రోడ్డున పడ్డా ప్రభుత్వాలకు చలనం లేదు. అధికారుల కళ్లకు కన్పించడం లేదు. ఇలాంటి సమస్యలు, ఇబ్బందులతో పామాయిల్ కార్మికులు పని చేస్తున్నారు. వారి శ్రమను దోచుకోకుండా శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాల్సిన తోట యజమానులు ఇవ్వడం లేదు. వారు ప్రమాదాలకు గురైతే నష్టపరిహారం అందించాల్సిన ఉద్యాన, విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడం చాలా దురదష్టకరం. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వారి సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ప్రజాప్రతినిధులకు ఉందని మరోసారి గుర్తు చేస్తున్నాం.

మానవ హక్కుల ఉల్లంఘన

కార్మికుల హక్కులను కాలరాసే సంఘటనలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. తోటల్లో గెలలు మోస్తున్న సందర్భంలో గెలల ముళ్లు గుచ్చుకుని శరీరంలో దిగబడటంతో అనారోగ్యాలకు గురవుతున్నారు. వారి హక్కులు కోల్పోతున్నారు. గుచ్చుకున్న ముళ్లతో ఇబ్బందులు పడుతూ సెప్టిక్ అయితే వైద్య ఖర్చులు కూడా అందడం లేదు. ఒక ఫ్యాక్టరీలో పని చేసే ప్రమాదం జరిగితే ఫ్యాక్టరీ యాజమాన్యం అన్నీ తానై చేయాలని చట్టాలు చెబుతున్నా అవి అమలు కావడం లేదు. అదే విధంగా పామాయిల్ కార్మికులకు మాత్రం ఏ చట్టం చుట్టంగా మారిన పరిస్థితి లేదు. ముఖ్యంగా మహిళా కార్మికులు వివక్షకు గురవుతున్నారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఒక మహిళా కార్మికురాలి సమస్య నేటికీ అలాగే ఉంది. తోట యజమానులు వేధింపులతో ఆ కార్మికురాలు తోట విడిచి బయటకు వెళ్లి వలస కార్మికురాలిగా మారిపోయింది. చింతలపూడి, ద్వారకాతిరుమల మండలాల్లో ఈ సంఘటనలు మనకు కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి.

పామాయిల్ కార్మికుల హక్కుల కోసం పోరాటం

పామాయిల్ తోటలో పని చేసే కార్మికులు మాత్రం ఎలాంటి గుర్తింపు నేటికీ లేదు. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు నిండినా పామాయిల్ కార్మికుల బతుకుల్లో ఎలాంటి మార్పు లేదు. పాలకులు పరిపాలించే అధికారులు ఐదేళ్లకు ఒకసారైనా మారుతున్నారేమోగానీ వీరి జీవితాల్లో మాత్రం వెలుగులు నింపడం లేదు. చెవిటివాడు ముందు శంఖం ఊదినట్లుగా రాష్ట్ర ప్రభుత్వానికి వీరి సమస్యలు కన్పించడం లేదు. ఉద్యాన, కార్మిక, విద్యుత్ శాఖల అధికారుల నిర్లక్ష్యానికి కార్మికుల కుటుంబాలు బలి పశువులుగా మారుతున్నాయి. జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. రైతు కోసం ఎంత తాపత్రయ పడుతున్నారో అదేవిధంగా కార్మికుల సంక్షేమం కోసం కూడా ప్రజాప్రతినిధులు తాపత్రయ పడాల్సిన అవసరం ఉంది. వారిది మాత్రమే ఓటు హక్కు కాదు. వీరికి ఓటు హక్కు ఉంది. ప్రభుత్వాలు, పాలకులు చెల్లించే ఘటనలు జరిగినా వారికి కన్పించకపోవడం హాస్యాస్పదంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పామాయిల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో 2017లో సంఘాన్ని ప్రారంభించి వారి హక్కుల కోసం, వారికి గుర్తింపు ఇవ్వాలని పామాయిల్ కార్మిక సంఘం పేరు పెట్టి పోరాడుతుంది. పామాయిల్ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నపూ డిమాండ్ కార్మికుల్లో ప్రధానంగా ఉంది. ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ కుటుంబ ఇన్సూరెన్స్ ఇవ్వాలి. ఫ్యాక్టరీ యాజమాన్యల నుంచి గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలి. పని ప్రదేశాల్లో చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు పనిముట్లు, గెడలు, కత్తులు వంటివి ఫ్యాక్టరీల ద్వారా ఇప్పించాలి. రవాణా ఖర్చులు కూలితో సంబంధం లేకుండా ఇవ్వాలి. దీర్ఘకాలం వికలాంగులుగా మారిన నేపథ్యంలో అలాంటి కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు బాధితునికి రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలి. ఇంకా పలు డిమాండ్ల కోసం పామాయిల్ కార్మిక సంఘం పోరాడుతోంది.

- పి.రామకృష్ణ

కుదిరితే పరుగెత్తు.
లేకపోతే నడువు.
అదీ చేతకాకపోతే పాకుతూ పో.
అంతేకానీ...
కదలకుండా అలా ఒకేచోట ఉండిపోకు..
-శ్రీశ్రీ

కోరుకొల్లును అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి

సర్పంచి, బట్టు లీలా కనక దుర్గ మహేష్



ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నిలిపేలా ప్రణాళికాబద్ధంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు సర్పంచి బట్టు లీలా కనకదుర్గ మహేష్ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా సుమారు కోటి రూపాయలతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు ప్రభుత్వ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించడం జరిగిందన్నారు. అలాగే పంచాయతీ నిధుల నుండి సుమారు రూ.80 లక్షలతో చెత్త నుండి సంపద కేంద్రం షెడ్డు నిర్మాణంతో పాటు, పలు సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్‌ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. రోడ్లు, డ్రెయినేజీ, పారిశుధ్యం, మంచినీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేసామన్నారు. జనరల్ ఫండ్స్ నుండి మైక్రో ఫిల్టర్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. కోరుకొల్లు నుండి కైకలూరు రోడ్డుకు, కలిదిండి రోడ్డుకు నూతన మంచినీటి పైపు నిర్మాణం ఏర్పాటు జరుగుతోందన్నారు. గ్రామ పంచాయతీకి శివారు గ్రామమైన చైతన్యపురంలో మంచినీటి సమస్య పరిష్కారానికి కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, దాతల సహకారంతో మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేపట్టనున్నామన్నారు. రూ.25 లక్షలతో సౌండ్ ఫిల్టర్ పనులు, రూ.11 లక్షలతో గుడివాడ రోడ్డులోని ఆర్‌సిఎం చర్చి నుండి మందబయలు వరకు, అలాగే కలిదిండి వెళ్లే రోడ్డు నుండి పాత హరిజనవాడ రోడ్డు వరకు విద్యుత్ సరఫరా ఏర్పాటుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ లైన్ లేనిచోట్ల నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. కోరుకొల్లు గ్రామాభివృద్ధికై లక్ష్యానికి అనుగుణంగా నిరంతర కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు సర్పంచి బట్టు లీలా కనక దుర్గ మహేష్ తెలిపారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ ఛైర్మన్ అడపా నాగరాజు



ప్రజాశక్తి - టి.నరసాపురం

మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘం అభివృద్ధికి పర్సన్‌లతో కలిసి తన వంతు కృషి చేస్తానని సొసైటీ ఛైర్మన్, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతిరైతుకూ సేవలందించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. రైతుల సంక్షేమం కోసం సొసైటీ సహకారం అందిస్తుందన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు పండించిన ధాన్యం, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంట రుణాలతో పాటు బంగారంపై తక్కువ వడ్డీకి అప్పులు కూడా ఇస్తున్నామని తెలిపారు. సొసైటీ ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, రైతుల సౌకర్యార్థం గోదాము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతు అడిగిన వెంటనే సకాలంలో పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో సంఘ అభివృద్ధిలో భాగంగా నూతన వ్యాపారాలు చేపడతామన్నారు. రైతుల రుణాలు, చెల్లింపులు, రైతులకు అవసరమైన ఎరువులు వంటి విషయాలను సంఘ సిఇఒ భుజంగరావు, ఇతర సిబ్బంది, పాలకులతో కలిసి చర్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. రుణాల మంజూరు విషయంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. సొసైటీ పరిధిలోని మధ్యాహ్నపువారిగూడెం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, అబ్బుల్లాపురం, సాలిగూడెం తదితర గ్రామాల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సొసైటీ సేవలు రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సొసైటీ ఛైర్మన్‌గా తనను నియమించి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు, స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ సారథ్యంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వారిలో ఆనందాన్ని నింపిందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు ఎంపీ, ఎంఎల్‌ఎలతో పాటు స్థానిక నాయకుల సహకారంతో మండల ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూస్తామన్నారు. మండలంలో ఏడాది కూటమి పాలనలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని, మండలాఅభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

నాయకపోడు పేదలకు అటవీ భూములు పంచాలి

ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా



ప్రజాశక్తి - టి.నరసాపురం

భూమిలేని నాయకపోడు పేదలకు ప్రభుత్వం అటవీ భూములు పంపిణీ చేయాలని ఆదివాసీ నాయకపోడు కమిటీ జిల్లా అధ్యక్షులు నారం రాజా కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నాయకపోడులు అన్ని సామాజిక తరగతుల్లో వెనుకబడినవారిగా ఉన్నారన్నారు. భూమి, భుక్తి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అడవితల్లిని నమ్ముకుని బతుకుతున్నారని, అటువంటి పేదలను ప్రభుత్వం గుర్తించి అటవీ భూములను పంచాలని కోరారు. ఏలూరు జిల్లాలో నాయకపోడులు సుమారు 40 వేల మంది ఉన్నారన్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు విడిపోయిన తర్వాత జిల్లాలో చింతలపూడి, టి.నరసాపురం మండలాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉండడంతో నాయకపోడులకు ప్రభుత్వం అందిస్తున్న ఐటిడిఎ నిధులు, ఎస్‌టి రిజర్వేషన్ ఫలాలు అందడం లేదన్నారు. ప్రభుత్వాలు నాన్ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నాయకపోడుల గ్రామాలను ఏజెన్సీ ప్రాంతంలో కలపాలని, ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు నాయకపోడులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలోని సబ్‌ప్లాన్ నిధులు నాయకపోడులకు అందించాలన్నారు. చదువుకున్న నాయకపోడు యువతకు ఐటిడిఎలో అవుట్‌సోర్సింగ్, పూర్తి ప్రాతిపదికన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఐటిడిఎ ద్వారా ఎస్‌టిలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో నాయకపోడులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామానికి ఎస్‌టి నిధులు కేటాయించాలని, గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని, తాగునీరు, రోడ్లు డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. నాయకపోడుల హక్కుల సాధనకు ఆదివాసీ నాయకపోడు కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. వర్గీకరణలో భాగంగా ప్రభుత్వాలు ఎస్‌టి వర్గీకరణ చేపడితే నాయకపోడులకు రిజర్వేషన్‌లో ప్రత్యేక స్థానం కల్పించాలన్నారు. నాయకపోడులకు విద్య, ఉపాధి అన్నిరంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా తెలుగు ప్రచురణ రంగం

1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన 'విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్' సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యవహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది.

ఏ భాషలోనైనా ప్రచురణ పరిపుష్టంగా ఉంటేనే ఆ భాషా సాహిత్యాలు, సంస్కృతి చిరస్థాయిగా, ప్రామాణికంగా ఉంటాయి. పుస్తక విక్రేతలు, పాఠకులు, ప్రచురణ రంగానికి ఆయువుపట్లు. మన ఆంధ్రదేశ స్థాయిలో అవలోకిస్తే మద్రాసు తదితర ఇతర ప్రాంతాల్లో గ్రాంథిక తెలుగులో పలురకాల తెలుగు పుస్తకాలు వెలువడినప్పటికీ, క్రిష్టియన్ మిషనరీలు తమ మత ప్రచారానికి 1811 అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం, బళ్లారి, విశాఖపట్టణంలో ప్రచురణ సంస్థలు ప్రారంభించాయి. ఆంధ్రదేశం వెలుపలనే పలు ప్రచురణ సంస్థలు భిన్నభిన్న తరహాల పుస్తకాలను ప్రచురించాయి. స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో ఆంధ్రదేశంలో కూడా తెలుగు ప్రచురణలు వెలువడడం ప్రారంభమయ్యాయి.

1940లో కృష్ణా జిల్లా పటమటలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం నిర్వాహకులు, రాజమండ్రిలో ఆంధ్రబుక్ డిపో వారు, 1908లో బందరులో ఆంధ్రభాషాభివృద్ధి గ్రంథమాల వారు, 1920లో విజయవాడలో మారుతీరామ్ అండ్ కంపెనీ వారు ఈ తరహాలో ఆంధ్రదేశంలో పలు ప్రాంతాల వారు తెలుగులో పుస్తకాల ప్రచురణలను ప్రారంభించారు. 1931లో గద్దె లింగయ్య విజయవాడలో స్థాపించిన ఆదర్శ గ్రంథమండలి బొందలపాటి శివరామకృష్ణ 1943లో ప్రారంభించిన దేశ కవితా మండలి మొదలైనవి విజయవాడలో పుస్తక ప్రచురణను ముమ్మురం చేశాయి. 1948లో వెంకట్రామ అండ్ కంపెనీ విజయవాడలో ప్రారంభమై విద్యావిషయక గ్రంథాలను విరివిగా ప్రచురించింది. అనతికాలంలోనే వివిధ అంశాల మీద అసంఖ్యాక పుస్తకాలు ప్రచురించి సర్వ తెలుగు పుస్తక విక్రేతలుగా ప్రసిద్ధి పొందారు. 1950లో విజయవాడలో స్థాపించిన నాస్తిక కేంద్రం వారు నాస్తికవాదం, హేతువాద, ప్రచార నిమిత్తం పుస్తకాలను ప్రచురించి తమదైన నూతన ఒరవడిని సృష్టించారు. 1951లో శ్రీనివాస చక్రవర్తి సాహితీ పబ్లికేషన్స్‌ను స్థాపించి సాహిత్యరంగాలకు సంబంధించిన వివిధ ప్రచురణలను వెలువరించారు. 1953లో అన్యభాషా సాహిత్య ప్రక్రియలను తెలుగులోకి తీసుకువచ్చి సంచలనాన్ని పురిగొల్పిన ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్ చిరస్మరణీయ సంస్థగా విజయవాడ ప్రచురణ రంగంలో స్థానం సంపాదించుకుంది. ఈ సంస్థ అధినేత కెఎస్ఎస్ శాస్త్రి ప్రేమ్‌చంద్ శాస్త్రిగా ఘనకీర్తి గడించారు.

విజయవాడ పుస్తక ప్రచురణరంగంలో 1953వ సంవత్సరం సరికొత్త అభ్యుదయ మలుపుకు నాందీవచనం పలికింది. 1953 జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంస్థ అభ్యుదయ సాహిత్య ప్రచురణకు, వ్యావహారిక భాషా ప్రచారానికి నడుం కట్టి దఫదఫాలుగా అసంఖ్యాక ప్రచురణలను వెలువరించింది. తెలుగు పాఠకులనూ అసంఖ్యాకంగా పెంచుతూ భిన్నభిన్న రంగాల పఠనీయ రుచులను పరిచయం చేసింది. అంతకు పూర్వం తెలుగులోకి రాలేని గురజాడ, గిడుగు ప్రభుతుల రచనలను సాహితీ పాఠకుల సాన్నిహిత్యానికి తెచ్చింది. అంతేకాదు, ప్రపంచఖ్యాతి గడించిన అన్య దేశీయ భాషల ప్రముఖ రచయితల గ్రంథాలను తెలుగు అనువాదాలుగా వెలువరించి తెలుగు ప్రచురణ రంగాన్ని విస్తృతపరిచింది. ఇంతటితో ఏ మాత్రం తృప్తిపడక ప్రచురణను పాఠకుల చెంతకు తీసుకువెళ్లడంలో, పఠనీయతను పెంపొందించడంలో అవిరళ కృషి చేసింది. ఈనాటికీ అగ్రగామి ప్రచురణ సంస్థగా వెలుగొందుతోంది. ఈ మధ్య కాలంలోనే కృష్ణా జిల్లా పరిధిలోనే పలు ప్రచురణ సంస్థలు ప్రారంభమై విజయవాడలో బ్రాంచీలను ప్రారంభించాయి. ఎం శేషాచలం అండ్ కంపెనీ వారు తెలుగు ప్రచురణ రంగంలో వినూత్న విప్లవాన్ని సృష్టించి, ఇంటింటికీ భిన్నభిన్న పఠనీయ గ్రంథాలను సరఫరా చేస్తూ పాఠకుల అభిరుచిని ఎంతగానో పెంచారు. ఈ సంస్థ ఎమెస్కో సంస్థగా రాష్ట్రంలోనేగాక రాష్ట్రేతర ఆంధ్రుల్లో కూడా సాహిత్యాభిలాషను పెంపొందించింది. 1957లో విజయవాడలో నవోదయా పబ్లిషర్స్ స్థాపితమైంది. ఈ సంస్థ 1960 నుండి రామమోహనరావు నేతృత్వంలో అప్రతిహతంగా సాహిత్య ప్రచురణలు చేపట్టింది. ఈషణ్మాత్రం ముద్రారాక్షసాలు లేకుండా ముచ్చటగొల్పే ప్రింటింగ్ టెక్నాలజీ, బైండింగ్‌లతో ఆయన వెలువరించిన గ్రంథాలు యువ పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బాల సాహిత్యరంగ ప్రచురణలలో వినూత్న మార్పులను తీసుకువచ్చారు. ఆయన ఆంధ్రదేశంలో నవోదయ రామ్మోహనరావు గానే లబ్ధప్రతిష్టులయ్యారంటే ఆయన తెలుగు ప్రచురణరంగం ఇతోధిక అభివృద్ధికి చేసిన అవిరళ కృషిని ఎవరూ విస్మరించలేరు. తదనంతర కాలంలో విజయవాడలో స్థాపితమైన నవభారత్ బుక్ హౌస్, జయంతి పబ్లికేషన్స్, పల్లవి పబ్లికేషన్స్, ప్రజాశక్తి, అలకనంద ప్రచురణలు మొదలైన ప్రచురణ సంస్థలు తెలుగువారి పాఠకాభిరుచిని ఎంతగానో పెంచాయి. రచయితలు, కవులు సంఖ్యాపరంగా హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ప్రముఖ ప్రచురణ సంస్థలు అనేకం విజయవాడలోనే నెలకొలనడం విశేషం. ఇందుకుగల ప్రధాన కారణాల్లో ఒకటి ముద్రణ, బైండింగ్ తదితర సాంకేతిక సౌకర్యాలు పుష్కలంగా ఉండడం, కొంత సౌలభ్యంగా ఉండడం, పేరెన్నికగన్న పత్రికలకు హైదరాబాద్ నగరం కేంద్రస్థానమైనప్పటికీ తెలుగు ప్రచురణరంగంలో భిన్నభిన్నపుస్తకాల ఆవిష్కరణ విజయవాడలో జరుగుతుండడం గమనార్హం. ముఖ్యంగా నాన్‌ఫిక్షన్ పుస్తకాలకు విజయవాడ ప్రచురణ రంగమే కీలకమైందిగా రూపొందింది. రాష్ట్రస్థాయిలో పుస్తక పరిశ్రమ విజయవాడలోనే దాదాపు 70 శాతం కేంద్రీకృతమై ఉన్నదంటే అతిశయోక్తి కాబోదు. ఆంధ్రదేశంలో అక్షరాస్యత ఉద్యమ ప్రభావానికి విజయవాడ పుస్తక ప్రచురణ రంగం గణనీయంగా దోహదపడింది.

కాలక్రమంలో ప్రచురణ సంస్థలతో పాటు పులువురు సాహిత్యకారులు, సాహితీ సంస్థలు, రచయితలు స్వయంగా ప్రచురణ బాధ్యతలను చేపట్టి విజయవాడ ప్రచురణరంగాన్ని తమవంతు బలోపేతం చేశారు. తెలుగు పాఠకలోకంలో లబ్ధప్రతిష్టులైన ఎంతోమంది రచయితల ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ గ్రంథాలు విజయవాడ నుండి ప్రచురితం కావడం మనకు గర్వకారణం.



ఈ ప్రపంచంలో ఒక వ్యక్తి ప్రత్యేకతను... తన దగ్గర వున్న సంపదను బట్టి కాకుండా... మొత్తం ప్రజల బతుకుల్లో సౌభాగ్యాన్ని నింపడానికి చేసిన కృషిని బట్టి గుర్తించాలి.

- రోబ్ గౌలాండ్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ సిడ్నీ నగర కమిటీ కార్యదర్శి, రచయిత.





పళ్లు కుట్టించుకోవడం అవసరమా..?







పళ్లు తీయించుకున్న తర్వాత లేదా పన్ను ఊడిపోయినా వాటిని మళ్లీ కట్టించుకోవడం అవసరమని స్టార్ డెంటల్ డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది పేషెంట్స్ దంత వైద్య నిపుణులను సంప్రదించినప్పుడు పళ్లు కుట్టించుకోకపోతే ఏమవుతుందని ఎక్కువగా అడుగుతుంటారన్నారు. శాశ్వత దంతాలు తీసుకున్న ఆహారాన్ని నమలడానికి ఉపయోగపడతాయని. ఒక దంతం పోయిన తర్వాత ఖాళీ ఏర్పడుతుందని తెలిపారు. ప్రతిపన్ను ఒకదాని ఆధారంగా మరొకటి అమరి ఉంటాయి. పన్ను తొలగించిన తర్వాత ఖాళీకి రెండు పక్కల ఉన్న పళ్లు వాటి అమరిక ఆధారం కోల్పోయి పక్కకు జరుగుతాయి. అలా జరగడం ద్వారా పంటికి పంటికి మధ్య ఖాళీ వచ్చి ఆహారం నిల్వ ఉండిపోయి పుచ్చుగా మారే అవకాశం ఉంది. పైన ఉన్న పన్ను కిందకు జరిగి పళ్లు అనుకునే విధానంలో మార్పులు వస్తాయి. అలా పళ్ల అమరికలో మర్పులు జరగడం వల్ల నోరు తెరుచుకోవడానికి సహకరించే జాయింట్ అరిగి నోరు తెరుచుకోవడంలో సమస్యలు తలెత్తుతాయి. తద్వారా కింద దవడ నొప్పి, దవడ పక్కకు జరగడం వంటి సమస్యలు వచ్చే అవకాశంఉంది. దాని వల్ల ఆహారం నమిలి జీర్ణం అయ్యే క్రమంలో ఇబ్బందులు కలుగుతాయి. పళ్లు ఎక్కువ సంఖ్యలో లేకపోతే నోటి వర్టికల్ డైమెన్షన్ తగ్గి నోటి చివర అంటే పెదవుల మూలల్లో లాలాజలం ఉండిపోయి ఫంగల్ అన్ఫెక్షన్స్ వస్తాయి.

పన్ను తీయించుకున్న వెంటనే వాటిని కట్టించుకోవడం ద్వారా పైన సూచించిన వాటి నుంచి దంతాలను కాపాడవచ్చు. మీ మొక్క దగ్గరలో ఉన్న దంత వైద్యుడిని సంప్రదించి అనువైన విధానంలో దంతాలను కట్టించుకోవాలని తెలిపారు.

ప్రజలతో ప్రజాశక్తి

(మొదటి పేజీ నుంచి)

చిరువ్యాపారులు, మహిళలు, విద్యార్థి, యువజనలకు బాసటగా నిలుస్తోంది.

మహనీయుల త్యాగాలతో, ప్రజల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి కార్పొరేట్, మతతత్వ శక్తుల మూలంగా ముప్పు ఏర్పడింది. మహత్తర స్వాతంత్ర్య పోరాటంలోనూ ప్రజాశక్తి పాలుపంచుకుంది. 1942లోనే పత్రిక ప్రారంభమైనా పాలకులు నిషేధం విధించడంతో నిలిచిపోయింది. తిరిగి 1968లో వారపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటో తేదీ నుంచి దినపత్రికగా దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం ఎనిమిది కేంద్రాల నుంచి వెలువడుతోంది.

భరతమాత ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య చొరవతో పత్రిక స్థాపన, వ్యవస్థాపక సంపాదకునిగా మోటూరు హనుమంతరావు వేసిన పునాది, పత్రికను విస్తరింప జేయడంలో ఎనలేని కృషి సల్పిన కొరటాల సత్యనారాయణ వంటి మహామహులు, వారి సహచరులు చూపిన మహత్తర మార్గంలోనే ప్రజాశక్తి నడుస్తోంది. పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషుల విశేష ఆదరణ వల్లనే కోవిడ్ విపత్తుతో సహా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ఈ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. మున్ముందు ఇంతకన్నా మిన్నగా ఆదరించి, ఆశీర్వదించాలని మనవి చేస్తున్నాం.

24 గంటలూ రోగులకు వైద్య అందించేందుకు కృషి



శ్రీకృష్ణా హాస్పటల్ డాక్టర్ బి.కృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

బెండపూడి వారి వీధి విజయబార్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణా హాస్పిటల్‌లో 24 గంటలూ రోగులకు అవసరమైన మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నానని డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. రోగులను పరామర్శిస్తూ వారి ఎముకలు, కీళ్ల, కండరాలు, ఇతర సమస్యలకు చికిత్స అందిస్తున్నానని, రోగి సాధారణ జీవితానికి చాలా ముఖ్యమైన కండరాల వ్యవస్థను, ఆరోగ్యాన్ని కాపాడతానని చెప్పారు. మోకాళ్ల నొప్పులు, వెన్ను నొప్పి, భుజం నొపి వంటి అనేక రకాల కీళ్ల సమస్యలకు చికిత్స అందించడంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కండరాలు, ఎముకలకు సంబంధించిన నొప్పి, గాయాలు, ఏదైన కదలిక సమస్యలతో బాధ పడుతుంటే శ్రీకృష్ణా హాస్పిటల్‌ను సందర్శించవచ్చున్నారు.

త ́ వ ం హాస్పిటల్‌లో ప్రతి నెలా రెండో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పేదలకు ఉచితంగా రక్త పరీక్షలు, ఉచితంగా ఎక్స్-రే, మందులు ఇస్తామని తెలిపారు. అనేక సంవతర్సాల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడేవారికి ఈ హాస్పిటల్‌లో తక్కువ ఖర్చులో పిఆర్‌పి చేయనున్నట్లు చెప్పారు.



దీనిలో మొదటి దశ, రెండో దశ దాటినవారికి టికెఆర్ అంటే మోకాళ్ల కీలు దెబ్బతిన్న భాగాలను కృత్రిమ భాగాలతో భర్తీ చేసే ప్రక్రియ అని తెలిపారు. పిఆర్‌పి ఇంజెక్షన్ ఒక రకమైన వైద్య చికిత్స అని చెప్పారు. ఇది నొప్పిని తగ్గించడానికి, మోకాలి కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి రోగి రక్తంలోని ప్లేట్‌లెట్లను ఉపయోగించి చేసే చికిత్స అని చెప్పారు. ఈ చికిత్స జరిగిన ఒక గంటలోనే డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లొచ్చని, చాలామంది రోగులు మా వద్ద శస్త్రచికిత్స తర్వాత నొప్పి నుంచి ఉపశమనం పొంది చురుకైన జీవనశైలిని పొందుతున్నారని తెలిపారు.